




జనవరి 1985
159

ఈ సంచికలో....

సంపాదకీయాలు			1, 4
జైలు కవితలు :	ఫిలిప్పైన్ విప్లవ నాయకుడు జోస్ మారియా సిజాన్ 'ప్రజలను సాయుధం చేస్తున్న రెవల్యూషనరీ నేటి కవి'		5
పాట :	విప్లవ భేరి	సాహు	27
కవిత :	ఉద్దానం-మైదానం మధ్య	రాజశేఖర్	28
ప్రచార సాధనాలు :	బండెడు అబద్ధం-చిటికెడు సత్యం	సులా	29
కథ :	మరో సారా కథ	కార్మిక	38
మానవతా విలువలు :	భోపాల్	ఉషా ఎస్. డాని	55
పాఠకులతో :	ముఖాముఖి	సాహితీమిత్రులు	61

వెనుక కవర్ డ్రాయింగ్ : ఉషా ఎస్ డానీ

ఆధారం : బోరిస్ ప్రోరకోవ్ రెండవ ప్రపంచ యుద్ధ సంఘటనలకు చలించి వేసిన 'This must not happen Again!' సిరీస్‌లోని 'The Air Raid, The Alarm' అనే రెండు పెయింటింగ్స్.

సృజన, హనుమకొండ 506 001

విడిప్రతి రూ. 3

సంవత్సర చందా రూ. 30

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Printed, Edited & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'

Printed at Navatha Printers, J. P. N. Road, Warangal - 506 002 for Venkataramana Mudranalayam, Warangal

హత్యా? వింధ్యా?

అతడు మంచిని చూడగలవాడు భవిష్యత్తులోకి చూస్తున్నవాడు. ప్రజలపట్ల పిచ్చి ప్రేమ శత్రువుపట్ల అంతే పిచ్చి కోపం కలవాడు. ఓటుకెదిగినవాడు కాని ఓట్లు దరిద్రాన్ని పోగొట్టవని, ఓట్లు వ్యవస్థను మార్చవని, ఓట్లు చిరునామాలు మాత్రమే మారుస్తాయనీ (ఓడిపోయిన పోలీసు మంత్రి మిలటరీ మంత్రి అవుతాడనీ) ఎరిగినవాడు. ఎదిగినవాడు. అదే ప్రజలకు చెప్పడానికి కాలికి బలపం కట్టుకొని తిరుగుతున్నాడు. ఆ ఊరుకూ అందుకే పోయాడు.

ఇంకొకతడు చదువుకున్నవాడు. సంపన్నుడు. అందువల్లనే పై చదువులు చదువుతున్నాడు. చదువు సంపన్నుల ఆస్తులు కాపాడడానికి అని గ్రహించాడు. అందుకే అంత పెద్ద చదువు నిజంగా అక్కర్లేని పోలీసు ఉద్యోగంలో చేరాడు. భౌతికంగా ఆస్తులను కాపాడగల ప్రత్యక్ష బాధ్యత అదే అని ఎన్నుకున్నాడు. పసి పిల్లలను మర్డర్ కేసుల్లో ఇరికించడం, పంతుళ్ళను వాళ్ళ కళ్ళముందు పిల్లల్ని హింసించి బెదిరించడం, తల్లిదండ్రుల్ని వాళ్ళ పిల్లలకోసం వేధించడం నేర్చుకున్నాడు. చేతులు నొప్పిపెట్టేలా, లాఠీలు విరిగేలా ప్రజల్ని కొడితే తప్ప ఆ చేతులతో జీతం రాళ్ళు ముట్టుకోలేనని ప్రభుత్వ ఉప్పుతిని ప్రతిజ్ఞ చేసాడు. మంచిని చూడగలవాని జాడ తెలిపి అందుకే ఆయనా ఆ వూరికే పోయాడు.

అందరు చూస్తుండగా వెంటబడి తరిమితరిమి, పొలాల్లో, బురదలో పీకుష్ట్ల కూరుకొని పడిపోయిన పిచ్చివాణ్ణి పట్టుకున్నాడు. తనకూ పరుగూ రొప్పూ తప్పనందుకు, అందరు చూస్తుండగా తానూ ఉరకాల్సి వచ్చినందుకు, కడక్ యూనిఫామ్, తళతళ మెరిసే బూట్లు బురద అంటి మట్టికొట్టుకొని పోయినందుకు ముందు అక్కడ కొసరు దెబ్బలు కొట్టాడు, కోపం దెబ్బలు కొట్టాడు విసుగు దుబ్బలు కొట్టాడు అహం దెబ్బతిన్న దెబ్బలు కొట్టాడు. చూస్తున్న అందరికీ తన హాణం తెలిసి బెదురు వుండాలని కొట్టాడు. మంచివాని నెత్తురు కొంత మట్టిలో చిందవచ్చు. అయినా ఇంకా అని అసలు దెబ్బలు తావు జంతువులా అతణ్ణి యూనిఫామ్ ఈడ్చుకపోయింది. పల్లె, పట్నం కళ్ల తేలవేసి చూసింది. భయంగా చూసింది. బాధగా చూసింది. కసిగా చూసింది. కడుపులో ఈ దృశ్యం రహస్యంగా దాచుకోవడానికి చూసింది. నలుగురికి అవసరంగా చెప్పడానికి చూసింది. మనుషులు చూసారు. మార్కెటు చూసింది. పొలాలు, మట్టి, బడి, సారాగుడిఅన్నీ చూసాయి.

స్వచ్ఛందంగా ఆ వూళ్ళోకి నడిచిపోయిన బడుగు శరీరం బలవంతంగా ఈడ్వబడుతూ ఆ వూళ్లోనుంచి నగరంలోకి నగరంలోని నరకంలోకి ప్రవేశించింది.

అక్కడాయనను చేతులు కొట్టాయి. నోళ్ళు తిట్టాయి. కాళ్ళు తన్నాయి. ఆ చేతుల్లో బలమైన లాఠీలు తుపాకి మడమలు. ఆ నోళ్ళనిండా ఆవులించినా పట్టనంత బండ బూతులు. ఆ కాళ్ళకు ఇనుప నాడాల బూట్లు. ఇవి అసలు దెబ్బలు. వర్గద్వేషంతో కొట్టిన దెబ్బలు. పేరు చెప్పమని కొట్టిన దెబ్బలు. ఉద్యమం ఊరు చెప్పమని కొట్టిన దెబ్బలు. విప్లవం జాడ చెప్పమని కొట్టిన దెబ్బలు. ఈ దెబ్బలు కొట్టింది మనుషులు కాదు- యూనిఫారాలు. ఈ దెబ్బలు కొట్టింది మనుషులు కాదు ఈ వ్యవస్థ చేతులూ కాళ్ళూ. ఈ వ్యవస్థకు రంగు రూపం వుంది. పేరు వుంది. ఇది అరూప్యమేమీకాదు. ఇది వర్గసంఘర్షణ- అవును. కాని అంతకన్నా ఇది భౌతికదాడి. ఈ దాడిలో ముందుచూపున్నవాడు ఎన్నికల మేళాలో చంపబడ్డాడు. ఎన్నికల ప్రచారాల ఘీంకారాల్లో అతని మూలుగు లాకప్ దాటి వినిపించలేదు. ఎన్నికల రంగుల టెలివిజన్ నిండా 'అమ్మ' నీడ. ఆ మృతదేహం ముందూవెనుక ఎన్ని మరణాలను కప్పేసిందని. ఒక్క మంచివాని చావు గురించి చెప్పుకోడానికి లేదు. అతడు చచ్చిపోయాడన్నది కాదు బాధ. అతడు అదృశ్యమయ్యాడు. చంపినవాడో వాళ్ళో చంపామని ఎట్లాగూ ఒప్పుకోరు. కాని చచ్చిపోయాడని చెప్పడానికి కూడా ఎవరూ లేరు. అదీ హృదయ విదారకం. 'ఎన్‌కౌంటర్ హత్య'లను పోలీసులు మరణాలుగా ప్రకటించి మెజిస్టీరియల్ విచారణలంతు నడిపి, నక్సలైట్లను చంపామని ఒప్పుకోకున్న వాళ్ళు ఎదురుకాల్పుల్లో చచ్చారని ప్రకటిస్తారు. పోలీసులాకప్‌లో అరెస్టు రికార్డులు లేదా నలుగురికీ తెలిసి దెబ్బలకు మరణిస్తే కడుపునొప్పో గుండెనొప్పో వచ్చి చచ్చాడని ప్రకటిస్తారు. అట్లా ఇప్పటికి ఎన్టీఆర్ పాలనలో ఇరవైముగ్గురు పోలీసు లాకప్పులలో హత్యచేయబడ్డారు. ఇరవై నాలుగోదయిన ఈ హత్యకు ఆధారాలు మనం చూపలేకపోతే అతడు బ్రతికేవున్నాడని చెప్పే బాధ్యత ప్రభుత్వం తీసుకోదు. అతని పేరు ఓటర్ల లిస్టులో వుండి వుంటే ఎనిమిదవ లోకసభను నిలిపిన ప్రజాస్వామిక స్తంభాల్లో ఆ పేరూ ఇంత ఇసుక వేసే వుంటుంది. అతని రక్తంతో తడిసిన చేతులు కడిగేసుకొని ఏమీ జరుగలేదని పోలీసులు అన్నట్లే అతని ఓటు వేసిన చెయ్యి వేలికి పెట్టిన గుర్తును తడి వుండగానే తుడిచేసుకొని మరి ఇంకొక ఓటు కూడ ప్రజాస్వామ్య బాధ్యతతో వేసే వుంటుంది. అతని పేరు ఓటర్ల లిస్టులో కూడ లేకపోతే, రేషన్ లిస్టులోకూడ లేనట్లే. రెండు రూపాయల కిలో బియ్యానికీ, జనతా ధోతికి నోచుకోనట్లే. రేషన్ లిస్టులో లేకపోతే జనాభా లెక్కల్లోనూ లేనట్లే. కనుక ఆయన కడుపుకింత తిండి, కాలికింత బట్ట ఇచ్చే బాధ్యత లేకపోవడమే కాదు ప్రభుత్వానికి ఆయన భూమిమీద బ్రతికే ఉన్నాడని చెప్పే బాధ్యత కూడా లేదు. ప్రపంచానికి కాదు కన్నతల్లికి కూడ చెప్పే సామాజిక, నైతిక బాధ్యతను ఆ పోలీసు స్టేషన్ మీద రాజ్యాంగం పెట్టలేదు.

సర్కస్‌లోనో, ఎగ్జిబిషన్‌లోనో, రైల్వేజంక్షన్‌లోనో, నగరంలోనో పిల్లలుతప్పిపోతే మే ఐ హెల్ప్ యు (నేను మీకేం సహాయం చేయగలను) అంటూ పోలీసులు కౌంటర్ పెట్టుకొని వుంటారు. కొన్నిసార్లు వెతికికూడా పెడతారు

కాని ఆ కన్నతల్లి పోలీసు స్టేషన్‌కు వచ్చి అడిగింది. నా కొడుకును అరెస్టు చేసారట. అని. పాపమా పిచ్చి తల్లికి అప్పటికే ఆమె కొడుకును చంపేసారని తెలియదు. ఆ పోలీసుస్టేషన్ కళ్ళలో ప్రాణాన్ని హరించి మృత్యు రహస్యం దాచిన క్రౌర్యాన్నీ ఆమె పోల్చుకోలేదు. తాను నవమాసాలు మోసి రక్తం ధారపోసి కని పెంచిన బిడ్డను, ఈ దేశంకోసం తన రక్తాన్ని ధారపోయడానికి అంకితమైన బిడ్డను. అందుకే ఈ వ్యవస్థ చంపేసిందని ఆ తల్లికి తెలియదు.

అరెస్టే చేయలేదని బుకాయించింది పోలీసు స్టేషన్. ఆధారమేముంది? అరెస్ట్ చేయలేదనప్పుడు పోలీస్ స్టేషన్‌లో చనిపోయారనడానికి ఆధారం ఏముంది? కనుక అరెస్టూ అబద్ధమే, హత్యా అబద్ధమే.

గజం మిథ్య పలాయనం మిథ్యం. గిట్టనివాళ్లు కల్పించిన కథ కావచ్చుగానీ అద్వైతం జీవుడు మిథ్య జగత్తు మిథ్య ఉన్నదొక్కటే సత్యం. అది అఖండాత్మ అని ఘోషిస్తుంది. అరెస్టు అబద్ధమే హత్యా అబద్ధమే. ఉన్నదొక్కటే సత్యం. అది పోలీసులు. పోలీసులే ఈ అద్వైత హింసకు భాష్యకారులు. వాళ్లు భార్గవా కమీషన్‌ను రద్దు చేయించగలిగారు. రాజన్ కేసులో నిర్దోషులై ప్రమోషన్‌లు పొందారు. రమీజాబీని చెరచీ కోర్టులో జంటిల్‌మెన్ అనిపించుకున్నారు.

నిజమే అరెస్టూ అబద్ధమే హత్యా అబద్ధమే. విప్లవాన్ని అరెస్టు చేయడం సత్యాన్నిహత్యచెయడం వ్యక్తికి కాదుగదా వ్యవస్థకూ సాధ్యమయ్యేపనిగాదు. మంచి చూపున్నవాణ్ణి చంపగలదేమోగానీ పోలీసు మంచినీ చంపలేదు. చూపునూ ఆపలేదు. భవిష్యత్‌లోకి దర్శనం అది ఒక తాత్వికఆచరణ. అది ఆచరణాత్మక తత్వశాస్త్రం. దాన్నెవడూ నిర్బంధించనూలేడు. నాశనమూచేయలేడు. కాకపోతే వర్గపోరాటం పదునెక్కుతున్నవేళ ఈవ్యవస్థ పదిదిక్కుల అంటుకున్న ఈమంటల్ని లాఠీలతో తూటాలతో ఆర్పగలనేమోనని పిచ్చెక్కి వెతక్కలాడుతుంది. ఆ లాఠీలూ తూటాలూ ఆ మంటల్లోనేపడి ఆ మంటలు మరింత భగ్గుమంటాయి. ఎందుకంటే అవి మంటలు కావు. ప్రజా పోరాట నెత్తుటి పంటలు.

3-1-85

సందేశం

ఈసారి ఎన్నికల కోసం జరిగిన హింసను తలచుకుంటే అయిదువందల మందికి అధికారం కోసం ఇన్ని వేల వేల ప్రాణాలు బలి కావలసిందేనా అని ఆక్రోశం కలగక మానదు. పత్రికల్లో వచ్చిన వార్తలప్రకారం దాదాపు ఏభై మందిఘర్షణల్లోనో పోలీసు కాల్పుల్లోనో మరణించారు. ఎన్నికలు ప్రకటించిన తేదీ మొదలు అయిపోయే దాకా ఆంధ్రప్రదేశ్‌లోనే ఇద్దరు అభ్యర్థులతో సహా ఎందరో ఎన్నికల ఘర్షణల్లో మరణించారు. ఎన్నికలయిపోయాక జరిగిన ఘర్షణలో మెదక్ జిల్లాలో ఇద్దరు చని పోయారు ఎన్నికల సందర్భంగా జరిగిన హింసే కాకుండా ఇటీవల కాలంలో ఎన్నికల గురించి జరిగిన హింసను తలచుకుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. ఈ ఎన్నికల కోసమే ఇందిరమ్మ పంజాబ్ మీద యుద్ధం ప్రకటించి మొదలు అటునుంచి నరుక్కు వచ్చింది. తర్వాత ఇటునుంచి మిలటరీని పంపించి. వేలాది మందిని చంపించి. ఎన్నికల కోసమే తాను చచ్చింది చచ్చి సాధించింది; ఢిల్లీ మొదలు ఏడు రాష్ట్రాల్లో వేలాది ప్రాణాలను, లక్షలాది ఓట్లను, కనుక అయిదు వందల మంది అధికారం కోసం కూడా కాదు ఒక్కరి అధికారంకోసం- ఎవరి 'చేతి'లో సామ్రాజ్యవాద, భూస్వామ్య దళారీ పాలక వర్గాల ప్రయోజనాలు భద్రమో- ఆ ఒక్కరి అధికారం కోసం ఒక్క సంవత్సరంలోనే వేల వేల ప్రాణాలు బలి అయ్యాయి. భోపాల్‌గ్యాస్ దుర్ఘటన రూపంలో సామ్రాజ్యవాదం- దళారీలు బలిగొన్న వేలమంది ప్రాణాలుగానీ, క్షామ, కరువు, వరదల రూపంలో ఆంధ్ర మొదలు అస్సాం వరకు బలియైన వేల ప్రాణాలుగానీ- ఒక్క అశ్రు నయనమ్ములేక, ఒక్క వీడ్కోలు గానమ్ములేక (Unwept and Unsung) అన్నట్లుగా ఈ ఎన్నికల పశువుల గిట్టల కింద ఆక్రందన కూడ కేసెట్ల టెలివిజన్‌ల, లౌడ్‌స్పీకర్ల ఘూకంకేకా, భేకంబాకాలలో కలిసిపోయింది.

తమ తమ తక్షణ ప్రయోజనాలకోసం, చాలకాలంగా నెరవేరని వాగ్దానాలకోసం కర్ణాటక మొదలు కాశ్మీరందాకా అక్కడక్కడా ఎన్నికలు బహిష్కరించిన వాళ్ళు వున్నారు. కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, అనంతపురం వంటి జిల్లాల్లోని కొన్ని గ్రామాల్లో నూతన ప్రజాస్వామిక విప్లవ చైతన్యంతో ఎన్నికలు బహిష్కరించిన వాళ్ళు వున్నారు. వీళ్ళ వ్యవసాయ విప్లవంకోసం ఎన్నికలను బహిష్కరించమని చెప్తున్నారు పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప అంటున్నారు. ఆకలితో చావడంకన్నా పోరాటంలో చావడం మేలు అంటున్నారు. ఈ ఎన్నికలకోసం బలిగొన్న ఇన్నివేల ప్రాణాలు ఇచ్చే సందేశం మాత్రం ఎన్నికలలో చావడంకన్నా పోరాటంలో చావడం మేలు.

4.1.'85

ప్రజలను సాయుధం చేస్తున్న రెవల్యూషనరీ నేటికవి

ప్రతి విప్లవ పోరాటమూ, అంతకుముందు గెలుపొందిన విప్లవాన్ని నమూనాగా తీసుకొని పోరాడుతుంటుంది గానీ, ఆ నమూనాను అధిగమించ గలిగినప్పుడే అది విజయవంతం కాగలదని జర్మన్ కమ్యూనిస్టుపార్టీ నాయకురాలు రోజాలగ్జంబర్గ్ రాసింది. గెలుపొందిన విప్లవాలు, నమూనాలు, వాటి సాహిత్యం ప్రచారమయినంతగా దెబ్బతిన్న విప్లవాలు ప్రచారం కాకుండా పోవడం వర్గ పోరాటాల లిఖిత చరిత్రలో భాగం. ఓటమిగర్భంలో విజయాన్ని కాంక్షిస్తూ మరుగున పడిన విప్లవాల అవ్యక్త కథల వలెనే వర్తమాన విప్లవ పోరాటాలు కూడా గెలుపొందే దాకా నడుస్తున్న చరిత్ర పుటల్లోకి రాకుండానే మిగిలిపోతుంటాయి. దేశంలోనూ, ప్రపంచంలోనూ ప్రచారసాధనాలన్నింటినీ తమ గుప్పిట్లో పెట్టుకున్న వాళ్ళు గుర్తించక తప్పని పరిస్థితులలో చేసే దుష్ప్రచారం మినహాయించి, ఈ విప్లవ పోరాటాల నడుస్తున్న చరిత్ర పోరాటప్రజానీకపు ప్రపంచంలోకి వచ్చే అవకాశమే ఉండదు. కానీ వీరులను వాళ్ళ అద్భుతమయిన రూపంలో చూడాలంటే వర్తమాన చరిత్రలో వెతకాలన్నాడు మావో * ఎప్పుడయినా అన్నింటికన్నా ఎక్కువ స్ఫూర్తిని ప్రేరణను ఇచ్చే పోరాటం నడుస్తున్న పోరాటమే. వర్తమాన ప్రపంచంలో జరుగుతున్న ఒక విశిష్ట విప్లవ పోరాటాన్ని- మైదానాలమీదకి రాబోతున్న వర్షం వార్తను అతి సన్నిహితంగా వినిపించడానికి పర్వతాలనుండి పరిగెత్తుకొచ్చే ప్రవాహంలా- ఈ పదహారు ఫిలిప్పైన్స కవితలు పరిచయం చేస్తాయి.

ఆగ్నేయ ఆసియాలో, పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న చిన్న చిన్న దీవుల సముదాయానికే ఫిలిప్పైన్స్ అని పేరు. మన రాష్ట్రం కన్నా చిన్నదయిన ఈ దేశంలో జనాభా నాలుగున్నర కోట్లని మించి ఉండదు. అందులోనూ మూడున్నర కోట్ల మంది గ్రామీణ ప్రాంతాలలోనే నివసిస్తుంటారు. ఆసియాలో వ్యాపారాన్ని, రవాణా సౌకర్యాలని క్రమబద్ధం చేసుకోవడంకోసం స్పానిష్ వలసవాదులు 16వ శతాబ్ది చివరి భాగంలో ఈ దీవులన్నింటినీ ఆక్రమించుకున్నారు. మూడువందల సంవత్సరాలకు పైగా కొనసాగిన వలసాధిపత్య కాలంలో చెప్పుకోదగ్గ తిరుగుబాట్లే రెండు వందలకు పైగా జరిగాయని చరిత్రకారుల అంచనా. వాటన్నింటిలోకి ఎక్కువ

---

* To find heroes in grand manner one must look into contemporory history – Mao Tse-Tung.

రక్తసిక్తమయింది, ఆఖరిది 1892 నుండి సాగిన సాయుధ తిరుగుబాటు. దేశం నిండా అల్లుకుపోయిన వందలాది దీవుల్లో ప్రతి దీవిలోనూ ప్రజలు సాగించిన పోరాటం ఆరేళ్ళపాటు సాగి 1898లో రాజధాని నగరాన్ని చుట్టుముట్టింది. ఫిలిప్పైన్ ప్రజల స్వాతంత్ర్య పోరాటానికి మద్దతుగా అని చెప్తూ అదే సమయంలో అమెరికా స్పెయిన్‌పై యుద్ధాన్ని ప్రకటించింది. అప్పటికే భారతదేశంలోనూ, చైనాలోనూ వేళ్ళూనిన ఇతర వలస వాదుల వ్యాపారంలో పోటీ నిమిత్తం పసిఫిక్ తీరంలో తన స్థావరాన్ని ఏర్పరుచుకోవాలనే వ్యాపార కాంక్షనే అమెరికన్లు తమ స్వాతంత్ర్యాభిలాషగా పిల్చుకున్నారు. స్వేచ్ఛ తనలక్ష్యంగా, డేగ జాతీయ పక్షిగా ఉన్న అమెరికన్ పతాకం 1901లో ఫిలిప్పైన్ దీవుల మీదకి ఎగురుతూ వచ్చింది. మరో సంవత్సర కాలంలో అమెరికన్ సహాయంతో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. 1902లో శాంతి భద్రతలు మళ్ళీ నెలకొన్నాయని అమెరికన్ ప్రభుత్వం ప్రకటించింది. ఆ సంవత్సర కాలంలోనే అమెరికన్ సైన్యాల సంఖ్య 70 వేల నుండి లక్ష ఇరవై ఆరు వేలకు పెరిగింది. అమెరికన్ ఆయుధ గిడ్డంగులు వంద నుండి 639 దాకా పెరిగాయి. "విదేశీ డేగ ఆకాశం మీద నిలిచి సూర్యుణ్ణి మూసేసింది."

ప్రధాన ప్రాంతాలలో స్వాతంత్ర్యపోరాటం అర్ధాంతరంగా ఆగిపోయినా, ఇతర ప్రాంతాలలో పోరాటం కొన్నాళ్ళుసాగి అమెరికన్ సాయుధబలగాల చేతిలో ఓడిపోయింది. ఈలోగా అమెరికా పసిఫిక్ తీరంలో వ్యాపారాన్ని కాక ఫిలిప్పైన్స్‌లో ఉత్పత్తిని కూడా మొదలెట్టింది. సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ అయింది. చెరుకు ఉత్పత్తి నిమిత్తం వేలాది ఎకరాలు అమెరికన్ కంపెనీల ఆధిపత్యంలోకి వచ్చాయి. పొగాకు కంపెనీలొచ్చాయి. కొబ్బరితోటలొచ్చాయి. 1920ల నాటికే ఫిలిప్పైన్ ఆర్థిక వ్యవస్థలో అన్నిరంగాలమీదా అమెరికన్ కంపెనీలు తమ ఆధిపత్యాన్ని స్థాపించుకొన్నాయి. అమెరికన్ల భాషలో (ఇంగ్లీషు), అమెరికన్ హీరోలను కీర్తిస్తూ, అమెరికన్ పద్ధతులను ప్రవేశపెడ్తూ కొత్త విద్యావిధానం వచ్చింది. అమెరికనైజ్ అయిన మధ్యతరగతి వచ్చింది. ఆ మధ్యతరగతి మాత్రమే కొనుక్కునే కన్స్యూమర్ వస్తువులను అమ్ముతూ కొత్త అమెరికన్ కంపెనీలు వచ్చాయి. 1930ల నాటినుండి అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పల్లెల్లో పనిచేసే కూలీలనుండి నగర జాతీయ మేధావులదాకా అందరు ఉద్యమించారు. దశాబ్దాలపాటు చెరుకుతోటల్లో పనిచేసేకూలీలువీరోచితపోరాటం సాగించారు. (అందుకే

'నేను చెరుకుతోటల బలిష్టమయిన ఔన్నత్యాన్ని ప్రేమిస్తాను'' అన్నాడు కవి.) వలస వాదానికివ్యతిరేకంగా బ్రిటిష్‌వాళ్ళకి, ఫ్రెంచివాళ్ళకి ఉపన్యాసాలిచ్చి పేరుతెచ్చుకున్న రూజ్‌వెల్ట్ ఫిలిప్పైన్ స్వాతంత్ర్య పోరాటాన్ని గుర్తించక నిరాకరించాడు. రెండవ ప్రపంచయుద్ధంలో జపాన్ దాడికి గురిఅయిన ఫిలిప్పైన్‌లో కమ్యూనిస్టుపార్టీ సాయుధ పోరాటం ఆరంభించింది. చివరికి యుద్ధానంతరం 1946 జూలై నాలుగున ఫిలిప్పైన్‌కు స్వాతంత్ర్యం వచ్చింది.

మరికొన్నేళ్ళపాటు అమెరికన్‌కంపెనీలు తమఉత్పత్తిని, వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగించవచ్చని, అమెరికన్ సైన్యాలకు సంపూర్ణాధికారాలు కూడి మరోపదేళ్ళు కొనసాగుతాయనే షరతులమీదస్వాతంత్ర్యంప్రకటించబడింది. ఉత్పత్తి మీద, సైన్యాల మీద అధికారంలేని స్వాతంత్ర్యం సామ్రాజ్యవాదానికి మరో కొనసాగింపేఅయింది కొన్ని వేల ఎకరాల భూమికి హక్కుదారయిన చర్చి సామ్రాజ్యవాదానికి తోడయింది. "పెనుసుద్దై తుప్పెక్కి పోయినా, చేతశిలువ బట్టుకొని అధికారం చలాయించింది."

1954లో ఒప్పందంలో రాసుకున్న ఏళ్ళు పూర్తయ్యాయి. అప్పటి ఫిలిప్పైన్ అధ్యక్షుడు రామన్ మెగ్‌సేసె మళ్ళీ ఆ ఒప్పందాలకు ప్రాణం పోసాడు. కమ్యూనిస్టుల నాయకత్వంలో జరుగుతున్న ప్రజాపోరాటాన్ని అణచడంకోసం అమెరికన్ సైనిక సలహాదారులను నియమించాడు. (ఆ క్రమంలో మెగ్‌సేసె బాగా ఆస్తులు కూడా సంపాదించుకొన్నాడు. ఆయన మరణించిం తరువాత ఆయన ఆస్తులతో ఏర్పడ్డ ట్రస్ట్ "ఆసియానోబెల్ బహుమానంగా" పేరుపొందిన మెగ్‌సేసె అవార్డులను ప్రతి ఏటా ప్రకటిస్తు వస్తోంది. గత సంవత్సరం ఈ అవార్డు ప్రముఖ పత్రికా రచయిత అరుణ్ షోరీకి వచ్చింది). క్రమ క్రమంగా కమ్యూనిస్టుపార్టీ పోరాట పథంనుండి దూరమవుతుపోయింది. వ్యవస్థపై అమెరికన్ ఆధిపత్యం మరింత పెరిగింది. అమెరికన్ సహాయంతో ఏర్పడ్డ ప్రభుత్వరంగం బలపడింది. భూస్వామ్యం, సామ్రాజ్యవాదం, బ్యూరోక్రాటిక్ పెట్టుబడిదారీ విధానం ఫిలిప్పైన్ ప్రజలకు ప్రధాన శత్రువులయ్యాయి, ఈ మూడింటికి వ్యతిరేకంగా సాయుధపోరాటానికి పిలుపునిస్తూ యువ విప్లవకారుడు అమాదో గుయెరారో నాయకత్వంలో 1968లో కొత్తపార్టీ, 1969 మధ్యలో నూతన ప్రజాసైన్యం (New People's Army) ఏర్పడ్డాయి. "తప్పులను సరిదిద్దుకొని, పార్టీని పునర్‌నిర్మించండి" అన్న డాకుమెంటు

(క్రాంతి ప్రచురణలు) ఈ కొత్తపార్టీ నిర్మాణానికి ప్రాతిపదిక అయింది. "భూమాత్రా తన పాలనను, ముగ్గురు దోపిడీ దేవతలను కూలదోయడానికి ఏకంకండి" అని నినదించిన ప్రజాకంఠం "మోడైన పొలాల మంటల్ని ఆహ్వానించింది."

1969లో పశ్చిమ తీరాన ఉన్న తార్లాక్ దీవిలో తన యుద్ధం ఆరంభించినపుడు నూతన ప్రజా సైన్యానికి 35 తుపాకులు, 65 మంది సభ్యులు మించి లేరు. మొదట్లోనే పార్టీ కేంద్ర కమిటీలో ఉన్న 26 మంది సభ్యులలో 20 మంది ప్రభుత్వం చేతచిక్కి చిత్రహింసలకు గురయి మరణించారు. అయినా "దొర్లే పర్వతాలపైనుంచి, పచ్చికల మైదానాల మీదినుంచి ఎదురుచూసే లోయల్లోకి మంటల్ని మోసుకుపోయింది" ప్రజా సైన్యం. తార్లాక్ నుండి తీరానే సాగుతూ రెండేళ్ళల్లో మూడు రాష్ట్రాలకు వ్యాపించింది. చివరికి 1972లో మార్కోస్ ప్రభుత్వం సైనిక పాలనను ప్రవేశపెట్టింది. అమెరికన్ల సహాయంతో విమాన దాడులను సాగించింది. గ్రామాలకు గ్రామాలని ఖాళీ చేయించి కొత్తగా ఏర్పరచిన "సెటిల్‌మెంట్స్"లోకి ప్రజల్ని నెట్టింది. ఈలోగా ప్రజాసైన్యం దక్షిణాన ఉన్న మిందానావ్ రాష్ట్రానికి చేరుకుంది. మిందానావ్ దీవుల్లో జాతీయ విముక్తి పోరాటం సాగిస్తున్న మొరో ప్రజలతో చేతులు కల్పింది. క్రమంగా దేశంలో ఉన్న 34 రాష్ట్రాలలోనూ అన్ని ప్రాంతాలకు తన ప్రాబల్యాన్ని విస్తరింపజేసుకుంది. ప్రతి రాష్ట్రంలోనూ ఒక విముక్తి ప్రాంతాన్ని ఏర్పరుచుకొని దేశంలో మూడవవంతు భాగంపై తన రాజ్యాధికారాన్ని నెలకొల్పింది. 1975-77 కాలం నాటికి దేశంలో గ్రామీణ ప్రాంతాలలో నూతన ప్రజాసైన్యం మిందానావ్ విముక్తి సైన్యంకలిసి ఇరవయి గెరిల్లా ఫ్రంట్‌లను స్థిరపరచుకోగలిగాయి. అదే సమయంలో చైనాలో అధికారంలోకి వచ్చిన టెంగ్సియావోపింగ్ నాయకత్వం ఆ విప్లవ పోరాటాన్ని అండించి, మార్కోస్‌తో ఆర్థిక సంబంధాలు పెట్టుకోవటం ఉద్యమానికి కొంత నిస్పృహ కలుగజేసినా, నాయకత్వం నిలదొక్కుకుని ముందుకు సాగింది. పరీక్షించే రుతువుల దీర్ఘకాలికలయను గ్రహిస్తూ.... ప్రళయాల మీదా తన ఆధిక్యతను ప్రకటిస్తోంది!!

ఈలోగా పట్టణ ప్రాంతాలలో మార్కోస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం బలంగా ముందుకు వచ్చింది. చర్చిలో ఒక భాగం రాడికల్ చర్చిగా చీలి ఉద్యమానికి పౌరహక్కులవిభాగంగా పనిచేయడం ఆరంభించింది. విశ్వవిద్యా

లయాలలో విద్యార్థినీ, విద్యార్థులు నగరాలలో సామాన్య ప్రజానీకాన్ని సంఘటిత పరచడం ఆరంభించారు. 1972లో ఎన్నికలు నిషేధించినప్పటినుండి నిరుద్యోగులయి పోయిన రాజకీయనాయకులు తిరిగి రంగంలోకి వచ్చారు. (వాళ్ళ నాయకుడయిన అక్వినోను ఇటీవలే అమెరికానుండి తిరిగొచ్చిన రోజున విమానాశ్రయంలో మార్కోస్ సైన్యాలు కాల్చి చంపేసాయి) 1972 నుండిఆరంభమయిన భయంకర నిర్బంధ కాండ అంతర్జాతీయంగా ప్రజాస్వామిక శక్తుల దృష్టికి వచ్చింది. మిలటరీ కారా గారాలలోమగ్గుతున్న సుమారు లక్షమందిరాజకీయఖైదీలను విడుదలచేయాలని కోరుతూ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రచారం మొదలెట్టింది. "శత్రువు చేతుల్లో, చిత్రహింస గహ్వరాల్లో గోడకు నిలబెట్టబడి మరణించిన యోధుల" జ్ఞాపకాలతో నూతన ప్రజా సైన్యం ముందుకేసాగుతోంది.

ఇంత విశాలమయిన భూభాగంలో తన రాజకీయాధికారాన్ని స్థాపించుకొని, ప్రజాసైన్యాన్ని పటిష్ఠంగా నిర్మించుకొని, వరిహద్దులలో సాగే జాతీయ విముక్తి పోరాటంలో రాజకీయంగానూ, మిలటరీరీత్యానూ బలమయినసంబంధాన్ని రూపొందిం చుకొన్న ఫిలిప్పైన్ కమ్యూనిస్టుపార్టీ మావో ఆలోచనావిధానాన్ని ఫిలిప్పైన్ సమా జానికి అన్వయించడంలో విశిష్టమయిన విజయాన్ని సాధించింది.

ఈ పోరాట క్రమానికి ఆద్యుడు అమాదో గుయరారో అనేపెక్ పేరుతో పరిచయమైన జోస్ మారియాసిజాన్. 1964 నేషనలిస్ట్ యూత్ కార్యదర్శిగా, ఆతర్వాత కాలంలో మూవ్ మెంట్ ఫర్ ది అడ్వాన్స్మెంట్ ఆఫ్ నేషనలిజమ్ కార్యదర్శిగా విద్యార్థులలోనూ ప్రాచుర్యం పొందాడు. అప్పటికి ఆయన కవితా సంకలనం ఒకటి వచ్చింది. ఫిలిప్పైన్ విశ్వవిద్యాలయంలో రాజనీతిశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తూ 1967లో జాతీయ ప్రజాస్వామ్యంకోసం పోరాటం (1967) అనే పుస్తకంతో మార్క్సిస్ట్ మేధావిగా ఫిలిప్పైన్ మేధావులలో పేరుపొందాడు. 1968లో విశ్వవిద్యా లయాన్ని వదిలి అడవులలో ప్రవేశించి అమాదో గుయరారోగా కమ్యూనిస్టుపార్టీ

కార్యదర్శి అయ్యాడు. నూతన ప్రజా సైన్యానికి మిలిటరీ అధ్యక్షుడయ్యాడు. అప్పటి కాయన వయస్సు 27 సంవత్సరాలు. క్రమంగా విస్తరించిన ప్రజా సైన్యం కవాతుకు మార్గదర్శకుడయ్యాడు. అదే సమయంలో ఫిలిప్పైన్ సమాజ చరిత్రను విశ్లేషిస్తూ "ఫిలిప్పైన్ సమాజం విప్లవం" అనే పుస్తకాన్ని రచించాడు. (దేశంలో ఇంకా నిషేధంలోనే ఉన్న ఈ పుస్తకం అమెరికాలో ఆసియా చరిత్ర పాఠాలలో పాఠ్య గ్రంథం అయింది). "శత్రువుమీద చేసే యుద్ధాల నుంచి గ్రహించే సారం ఒక మనిషిని యోధుణ్ణి చేస్తుంది" అని రాసుకున్న సిజాన్ చరిత్రను విశ్లేషించడానికి, విప్లవ వ్యూహాన్ని రూపొందించడానికి ఉన్న అన్యోన్య సంబంధాన్ని గుర్తించినవాడయి విప్లవానికి, సైన్యానికి నాయకుడయ్యాడు. చివరికి 1977 నవంబరులో భార్య జూలియెట్‌తో సహా సిజాన్ అరెస్టయ్యాడు. అరెస్టయిన వెంటనే మార్కోస్ కోరిక మీద ఆయన్ని మార్కోస్ ముందు హాజరు పెట్టారు. సైన్యాధిపతి స్వయంగా ఇంటరాగేషన్‌ను చిత్రహింసను నిర్వర్తించాడు. అంతర్జాతీయశక్తులఒత్తిడితో రెండు నెలల తర్వాత ప్రభుత్వం ఆయన్ని కోర్టులో ప్రవేశపెట్టింది. అప్పటినుండి "నియంతృత్వాన్నీ బోర్డమ్‌నీ జయించడానికి స్వేచ్ఛా గీతాలు" ఆలాపించడం మొదలెట్టాడు. రాజధాని నగరం పొలిమేరల్లో మిలటరీ కారాగారంలో చీకటికొట్లో రోజులో ఇరవయి గంటలు తన మంచానికి సంకెళ్ళతో బంధింపబడి గత ఎనిమిది సంవత్సరాలుగా 'వర్తమాన చరిత్రలో తన అద్భుతమయిన రూపంలో కన్పించే వీరునిగా' పోరాటానికి ప్రతీక అయ్యాడు.

చరిత్రకారుడు, కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి, ప్రజా సైన్య నిర్మాత అయిన ఈ గెరిల్లా యోధుడు కవికూడా. ఆయనవే ఈ పదహారు గీతాలు.

(ఈ కవితలన్నీ చికాగోలోని Alliance for Philippine National Democracy వాళ్లు ప్రచురించిన JOSE MARIA SISON కవితా సంకలనం నుండి అనువదింపబడ్డాయి. మిలటరీ నిర్బంధం నుండి ఈ కవితలు బయటికెలా వచ్చాయో ప్రచురణకర్తలు ఎక్కడా చెప్పలేదు).

గెరిల్లా కవిలాగే ఉంటాడు

గెరిల్లా కవిలాంటి వాడే
ఆకుల గలగలలకు
రెమ్మలు విరిగే చప్పుడికి
సెలయేటి బుడగలకి
మంటల వాసనకి
వియోగాల బూడిదకు
అతను స్పందిస్తాడు

గెరిల్లా కవిలాంటి వాడే
అతను వృక్షాలతో
పొదలతో, శిలలతో మమేకమవుతాడు
సందిగ్ధంగా ఐనా సూటిగా ఉంటాడు
గతిసూత్రాలను స్పష్టంగా
అవగాహన చేసుకుంటాడు
అనేకానేక భావ చిత్రాలకు
అధికారం వహిస్తాడు

గెరిల్లా కవిలాంటి వాడే
ప్రకృతి శృతిలో కలగలిపిన
పచ్చదనపు అంతర్లయలో
మిళితమైన ఉక్కుపట్టు
చుట్టు అల్లుకున్న నిశ్శబ్దం, అమాయకత్వంలో
శత్రువుకు వలపన్నుతుంది

గెరిల్లా కవిలాంటివాడే
కిరీటమై అందరినీ ఆహ్లాదపరిచే
ఎర్ర పూలు జ్వలించే పొదల్లో
అతను ఆకుపచ్చని, గోధుమ రంగు
సమూహాలతో సంచరిస్తాడు

జైలు కవితలు :

ఇంతకన్నా సౌందర్యం లేదు

నిర్బంధించబడితే
కాడ్వెల్ లాగ నేను కూడ
విప్లవ గీతాలల్లాలని
వాన్నాళ్ళ కిందే నిర్ణయించుకున్నాను

ఆయన కటకటాల వెనక్కి తోసేయబడే నాటికి
ఉద్యమం పురోగమిస్తోంది
ముత్యంలా తెల్లనైన బియ్యం గింజ గురించి పాడుతూ
ఆయనెన్నడూ సంబంధం తెంచుకోలేదు

కారణాలన్నీ తలపోసి
త్వరలోనే విడుదలవుతాననుకుంటాను
ఈ రుతువుల గమనం
విజయం పట్ల సందేహాలు
పారదోలుతుందని నాకు తెలుసు

ఈలోగా నియంతృత్వాన్నీ విర్వ్యాపకత్వాన్నీ జయించటానికి
స్వేచ్ఛా గీతాలు ఎలుగెత్తడం కన్న
ప్రజా పోరాటాలు గానం చేయడం కన్న
మించిన సౌందర్యం మరేదీ లేదు

నా స్వభావం వంటిదురుకైన స్వేచ్ఛా ప్రవాహాన్ని
ఒక బందిఖానాలో సమాధి చెయ్యడం అసాధ్యం
మత్తెక్కించే గంటల్ని ధిక్కరిస్తూ
నేను తల ఎత్తుతూనే వుంటాను

1977 నవంబర్ 30

ఆ ప్రాంతాన్నంతా వరదలా ముంచెత్తి
అంతిమంగా కేంద్రం మీదకి కవాతు చేస్తారు

ఆ నిరంతర ఉద్యమ శక్తి
దీర్ఘకాలిక భూమికను
ప్రజా ఇతిహాసాన్ని, ప్రజాయుద్ధాన్ని
ఆవహిస్తుంది.

అమరుల గౌరవార్థం

యుద్ధరంగాలలో
శత్రువు చేతుల్లో
చిత్రహింసా గహ్వరాల్లో
గోడకు నిలబెట్టబడి
మరణించిన యోధులందరినీ
అనంత ఆకాశంవరకూ
అన్నివేళలా మేం కీర్తిస్తాం
ఈ దుర్భర ప్రాంతాలలో
పోరాటం అతి నిశితమైనది
ఇక్కడ జీవితపు అర్థం
ఒకే ఒక్క ముఖ్యమైన క్షణంలో
పరీక్షించబడుతుంది
అంతిమశ్వాస వరకూ సాహసమే
వీరుణ్ణి మరణానంతరం జీవించేట్టు చేస్తుంది

1977 డిసెంబర్ 9

వీరుడెవరు ?

మరణించిన పద్ధతి కాదు
శత్రువు మీద చేసే
యుద్ధాల నుంచి గ్రహించే సారం
ఒక మనిషిని యోధుణ్ని చేస్తుంది

యుద్ధరంగంలో మరణించే వీరుడున్నాడు
ఆకలితో రోగంతో చనిపోయే వీరుడున్నాడు
ఏదోఒక ప్రమాదంలో ప్రాణాలుకోల్పోయే వీరుడున్నాడు
వృద్ధాప్యంతో కాలం చెల్లే వీరుడున్నాడు

ఎట్లా మరణిస్తేనేం
చివరి శ్వాస వరకూ
ప్రజలకు సేవ చేయడమే
వీరుల సహజ లక్షణం

1977 డిసెంబర్ 10

ఒక చల్లని గాలి తెమ్మెర

ఖైదులోకి ఒక చల్లని గాలితెమ్మెర వీస్తుంది
శరీరాన్ని ఉల్లాసపరిచి హృదయాన్ని వెచ్చ జేస్తుంది
అది నిమురుతుంది, ముద్దాడుతుంది
"జైల్లోకూడ గొప్ప పోరాటం ఉంది" అని
గుసగుసలాడుతుంది

ఈ గాలి తెమ్మెర
ఎర్రపూల పరిమళాన్ని మోసుకొస్తుంది
అన్ని దీవులనూ చుట్టివస్తున్న
ఆ నిర్నిరోధ మహాపోరాట ప్రభంజనంలో
ఒక భాగమే ఇది
అన్నిచోట్లా వినిపించే సందేశం
పోరాడు
గెలువు

1977 డిసెంబర్ 14

ఒక కామ్రేడ్ వివేచన

ఒక అరుణారుణ యోధుడు యుద్ధంలో మరణించాడు
అతని చెల్లెలి కుమిలి కుమిలి ఏడుస్తోంది
ఒక కామ్రేడ్ ఆమె దగ్గరికి వెళ్ళి
"అతను నాకు మంచి మిత్రుడు

నాకు కూడ విచారంగానే ఉంది
కాని అతణ్ణి తల్చుకుంటే గర్వంగా ఉంది
సంతోషంగా ఉంది
ఎందుకంటే అతను చివరి వరకూ
విప్లవకారుడుగా ఉన్నాడు
ఆ వాస్తవాన్నింకేదీ మార్చలేదు" అన్నాడు
ఆమె తన కన్నీళ్ళు తుడుచుకుని
చిర్నవ్వు నవ్వింది
ఆ మాటలు విని నేనామె కళ్ళలోకి
చూపులు సారిస్తే వివేచన
నా హృదయంలోకి ప్రవహిస్తున్నట్టనిపించింది

1977 డిసెంబర్ 14

(పేరులేని గీతం)

బాధల దుర్గమ మార్గాల నుంచి నడిచినా
నేను నిరాశ చెందలేదు
అన్యాయాన్ని అణచివేతనూ ఎదిరించినందుకు
నాలాగనే బాధలనుభవించిన
అసంఖ్యాకులు నాకు తెలుసు
ప్రజల మీద
వర్గాల పాలన అంతమయ్యేదాకా
ఇంకెందరో
బాధలనుభవించాలని నాకు తెలుసు

ప్రజలకు విప్పందించడానికి
దేవతలను ధిక్కరించిన ప్రొమిథియస్
వధ్యశిలకు కట్టేయబడి
తన కండల్ని పీక్కుతినడానికి

రాబందులు మీద వాలుతున్నప్పుడు
నిరాశపడి ఉంటాడా?!

బహుశా నిరాశ పడి ఉండడు
దేవత లెంత శక్తివంతులైనా
నిప్పుమీద భవిష్యదధికారాన్ని
ప్రజలకు తానందించానని
తాను ధిక్కరించిన దేవతలనే
అంతంచేసే జ్ఞానాన్నీ శక్తినీ
ప్రజలకు తానందించినానని
భవిష్యత్ దర్శనం ఉండి ఉంటే
ప్రొమిథియస్
బహుశావిరాశ పడి ఉండడు

వేదనా భరితమైన ఈదినాలలో
నా భవిష్యత్ దర్శనం కూడ
ఎంతో కొంత ప్రశాంతతతో
జీవించగల శక్తినిస్తుందా?
నిజానికి
ఆశోపహతులైన లక్షలాది ప్రజలముందు
నేననుభవించే వేదన ఎంతటిది?
గొప్ప జ్ఞానం కోసం స్వేచ్ఛ కోసం
ప్రయత్నించే ప్రతి మనిషిలో
ప్రొమిథియస్ జీవిస్తాడు
దేవతలు చనిపోయి
ఎవరికీ గుర్తులేకుండా మాసిపోతారు

1978 జనవరి 21

విదేశీ డేగ - స్త్రీ

మన చుట్టూ సముద్రం
మహాశక్తితో హోరెత్తి
ఒక నూత్న జీవితాన్ని వికసించనిమ్మని
మనసు అభ్యర్థిస్తోంది
మన పడవ మీది స్త్రీ
ప్రసవ వేదన పడుతోంది
మన తీవ్రమైన పడవ గమనం
పడవను నడిపే మనజోరు
ప్రయోజనాన్నివ్వాలి
మహా తరంగాల మీదకూడా
మనం స్వారీ చేయగలం

కాని ఒక విదేశీ డేగ
ఆకాశం మీద నిలిచి
సూర్యుణ్ని మూసేస్తుంది
దాని ఉక్కు పంజాలనుంచి
రక్తపు చుక్కలు రాలుతాయి
దాని రెక్కలు
గాలిని అల్లకల్లోలం చేస్తాయి
ఆకాశాన్ని చీకటిమయం చేస్తాయి
దానికి చీల్చివేసే
క్రూరమయిన చూపులున్నాయి
పదునైన దాని పళ్ళ మధ్య
మాంసం పీలికలున్నాయి
కాని చూడు
దానికీ ఓ గాయం ఉంది
త్వరపడు
పదునయిన బాణాన్ని గురిపెట్టు
మన బలమయిన

స్రా విల్లుని* ఎక్కుపెట్టు
స్త్రీ మీదా పడవ మీదా పడిన
హేయమైన డేగ నీడను
మనం తృణీకరిస్తున్నాం

మనం చీకట్లోనైనా దారి తప్పం
మనకు మన సముద్రాలూ దీవులూ
ఖచ్చితంగా తెలుసు
మన దీక్ష పటిష్టం
మన మార్గం స్పష్టం
మనమీద పొంచి కూచున్న
ఈ రక్కసి పక్షిమీద
మన పొరుగువాళ్ళ లాగానే
మనం కూడా విజయం సాధిస్తాం

భూమివేపు వీస్తున్న తూర్పు గాలి
మనకు అనుకూలంగా ఉంది
మన శ్రమ నిష్ఫలం కాదు
ఎర్రని తెరచాప
ఎట్లా ఎగురుతోందో చూడు
ఉధృత మవుతున్న తుపానులో కూడా
ఎర్రదీపం
ఎలా జ్వలిస్తోందో చూడు
మనం నిశ్చయంగా
మన రేవు చేరుతాం

విశిధి శిశువు
కల్లోలపు శిశువు
ఈ కడగండ్ల స్త్రీ శిశువు

---

* స్థానికంగా వాడుకలో ఉండే ఒక రకమయిన విల్లు

ఒక దృఢమైన ఇంట్లో జన్మిస్తుంది
ఆ ఇల్లు
కాంతితో నిండి ఉంటుంది
నేల మీదను దృఢంగా నిలుస్తుంది
ఆమె ప్రసవ వేదన
అంతులేని ఆనందంగా మారుతుంది

శిశువుకు నీళ్ళు పొయ్యడానికీ
తల్లి దాహం తీర్చడానికీ
కొండల మధ్య ఊట నుంచి
స్వచ్ఛమైన మధురమైన
నీళ్ళు తెస్తాం
ఆమె చనుబాలు
పుష్కలం కావడానికీ
బలవర్ధకం కావడానికీ
మనం ఆ తల్లి నోటికి
తేనె అందిస్తాం
పళ్ళందిస్తాం

సూర్యకాంతి ఉజ్వలత్వంలో
అరుణారుణమైన గులాబులూ
సకల సువాసనా పుష్పాలూ
ఏరుకొచ్చి
మనం పురిటిగదిని అలంకరిస్తాం
ఆ రోజు
మనమెన్నడూ మరిచిపోలేని రోజవుతుంది
మన లాంటి వాళ్ళందరికీ
విజయానంద దినమవుతుంది

1978 మార్చి 5

కొలిమి

డిసెంబర్‌లో అయితే
నా బందిఖానాను
అర్ధరాత్రిపూట చలిపెట్టెతోనూ
మిట్టమధ్యాహ్నంపూట పొయ్యితోనూ పోల్చుతున్నాను

ఇక ఈ వేసవిలో
దీన్ని నేను నరకంతో పోలుస్తాను
కానైతే దీని సౌందర్యం వల్ల
దీన్ని నేను కొలిమి అని కూడా పిలుస్తాను

ఉక్కుసు కాకలు తీర్చేదీ
బంగారాన్ని పుటం పెట్టేది
కుప కుప మండే ఈ కొలిమి
అనుకున్నపుడే
ఈ పోలిక నాకు ఊరట

భూమిమీది రాక్షసునికి వ్యతిరేకంగా

ఈ భూమిమీది రాక్షసుడు
శతాబ్దాలుగా రక్తమాంసాలను ఆబగా మెక్కుతున్నాడు
ఇప్పుడు వాడు ధరించిన కరవాలం
పెళుసుదై తుప్పెక్కిపోయినా
చేత శిలువ బట్టుకొని అధికారం చలాయిస్తాడు

మేం అగ్రిహ పుత్రుల వెంట నడిచి
వాడి తోవలో
ద్రాక్ష తీగల వల కింద
పరిచిన ఆకుల తివాచీ
వెదురు ఈ బెల మర్చిన గొయ్యిని
దాచిపెడుతుంది

ఆకలిగొన్న ఆ గొయ్యిలో పడి
ఈ వెలమధ్య పిచ్చి కేకలతో మెలిదిరుగుతూ
వాడు
నేలతల్లి బిడ్డలు తనమీద
తొట్లతో మంటలు మండే చమురును
చల్లడం చూస్తాడు
ఆ మంటలతో చీకటంతా పారిపోతుంది
ఆ మంటలు వేకువదాకా ప్రజ్వరిల్లి
సూర్యకాంతిలో సంలీనమవుతాయి
రాక్షసుడు అంతరిస్తాడు
తియ్యని ఊట జాలువారే బండలమీద
వాడి కరవాలాన్ని ఒక సుత్తి బద్దలు కొడుతుంది
సుత్తితో అణగ్గొట్టి
కొత్త వస్తువులు సృష్టించడానికి
మేం ఆ కరవాలపు ముక్కల్ని ఏరుకుంటాం

తమ దేశంలో తమ మీద
మోపబడిన కాడినుంచి
భీతావహం నుంచి
నేలతల్లి బిడ్డలు విముక్తి పొందుతారు
యుక్తితో
ముంచెత్తే బాహుళ్యంతో
ఏ రాక్షసుడికైనా ఎదురు నిలిచి
విజయం సాధిస్తారు

నేలతల్లి బిడ్డల విజయోత్సవమే
సమస్త కష్టజీవుల విజయోత్సవం
అనాది రాక్షసుడు అంతమైన వేళ
నేలతల్లి బిడ్డలతో కలిసి
మేం ఆనందంగా గొంతెత్తుతాం
నాట్యాలు చేస్తాం

1978 మార్చి 17

చీకటి లోతుల్లో

జైలు చీకటి లోతుల్లో
మనసు సమాధి చేయాలని
శత్రువు కోరుకుంటాడు
మరి భూమి చీకటి లోతుల్లో నుంచే
మెరిసే బంగారాన్ని తవ్వి తీస్తారు
సముద్రపు చీకటి గర్భాల్లో నుంచే
మెరిసే ముత్యాల్ని పట్టుకొస్తారు
మనం బాధలనుభవిస్తాం
కానీ మనం అధిగమిస్తాం
దీర్ఘకాల పోరాటంలో రూపొందిన
మన స్వభావపు లోలోతుల్నుంచి
బంగారాన్నీ ముత్యాన్నీ
మనం వెలికి తీస్తాం

1978 ఏప్రిల్ 10

వర్షాగమనం

చిటచిటలాడే వేడిమితో
కుప్పగూడిన పెద్దపెద్ద మేఘాలు
నేలను చీకటిమయం చేస్తాయి
కాని ఉరుములూ మెరుపులూ
వర్షంతో ఒక వినూత్నప్రగతి ఋతువును ప్రకటిస్తాయి

వర్షం మైదానాలమీదికొచ్చే వార్తను
అతి సన్నిహితంగా వినిపించటానికి
విస్తారమైన గాలీ, లోతెక్కే ప్రవాహమూ
పర్వతాలనుంచి పరుగెత్తుకొస్తాయి
చెట్లు తమ చేతుల్ని ఆకాశందాకా చాపి
ఆహ్లాదాన్ని అభినయాన్ని నర్తిస్తాయి

పొదలు మేల్కొని
పాటల్లో కేరింతల్లో
చెట్లతో తమ గొంతు మేళవిస్తాయి

గాలి ఎండుటాకుల్ని ఊడ్చేసి
మోడైన చెలకల మీద నిప్పురవ్వను
రగిలిస్తుంది
మంటలు పైకెగిసి
నీటి వెల్లువల కోసం ఎదురు చూస్తున్న
నేలతల్లి దాహాన్ని మరింత పెంచుతాయి

1978 జూన్ 15

పర్వతాలమీద వర్షమూ సూరీడు

ఉరుములూ మెరుపులూ ముగిసిపోయాక
చల్లని నల్లని మేఘాలు పర్వతాల్ని
వికారమైన బురదగా కరిగించినట్టు కన్పిస్తుంది
కాని ఈ విచారకర దృశ్యం వెనుక
వర్షం భూమిని తడుపుతుంది
చెత్తను తేలుస్తుంది
సెలయేళ్ళలో నదులలో జీవాన్ని నింపుతుంది
గాలి కేకల మధ్యనే
శిఖరాలమీదా చెట్లూ పొదలూ
లోలోతుల్నించి పోషణను పొందుతాయి
మైదానాల మీద పంటలూ అంతే

అప్పుడా చీకటిని చీల్చుకొని
పర్వతాలను వెచ్చజేయడానికి
చెట్లవేళ్ళకు భూమిమీద

మరింత పట్టు ఇవ్వడానికి
సూరీడు వెలువడుతాడు
వన్య జీవితపు
ఆకుపచ్చని దివ్యత్వమంతా మెరుస్తుంది
పక్షుల ఉన్మత్త గీతాలతో
మృగాల ఆనంద నాట్యాలతో
ఉత్సవాలు చేసుకుంటుంది
చల్లని పవనాలలో సూర్యాస్తమయం
దప్పిక తీర్చే స్వచ్ఛమైన నీళ్ళలోకి
కాంతి కిరణాలు గుచ్ఛుతుంది

వర్షమూ తుపానూ మాత్రమే ఉండి ఉంటే
పర్వతాలు బురదమయమయిపోయేవి
సూరీడూ కరువూ మాత్రమే ఉండి ఉంటే
పర్వతాలు ధూళిగా మారిపోయేవి
వర్షం తర్వాత సూర్యుడు
దేదీప్యమానంగా ఉంటాడు
సూర్యుని తర్వాత వర్షం
ఉల్లాసంగా ఉంటుంది
రుతువులు ఈ దీర్ఘకాలిక అయను
పరిక్షించే వాటి స్వభావాన్ని
పోగుపడిన వాటి సొగసుని గ్రహిస్తూ
పర్వతాలు తమ గాంభీర్యాన్ని నిలుపుకుంటాయి
ప్రళయాలమీద తమ ఆధిక్యతను ప్రకటిస్తాయి

1978 జూలై 5

జ్వలిస్తున్న పొదల్లోంచి

'భయోత్పాతపు పాలనను
ముగ్గురు దోపిడీ దేవతలను*
కూలదోయడానికి ఏకంకండి' అని
పర్వతంలో జ్వలిస్తున్న పొదలోంచి
ప్రజాకంఠం గర్జిస్తుంది

ఆపొద నుంచి నాలుకల నిప్పురవ్వ
చిటపటలాడి
దొర్లే పర్వతాల మీది నుంచి
పచ్చిక మైదానాల మీది నుంచి
ఎదురుచూసే లోయల్లోకి
మైదానాల్లోకి
మంటల్ని మోసుకు పోతుంది

మరిన్ని జ్వలించే పొదలు
ప్రచండమై గర్జిస్తాయి
సాహసికంగా మంటలు పొలాల్లోకి
దూసుకు పోతాయి
అంటుకున్న మోడైన పొలాల నుంచి
మంటల్ని పైపైకి గింగరాలు తిప్పుతాయి
విగ్రహాల రక్షణ స్థావరం మీద
మెరుపుల దాడి చేస్తాయి
ఎగిరే మంటలు గవాక్షాల నుంచి ప్రవేశించి
కోట ద్వారాల్ని దిగ్బంధనం చేయమని
మోడైన పొలాల మంటల్ని ఆహ్వానిస్తాయి

1978 జులై 15

---

* భూస్వామ్యం సామ్రాజ్యవాదం బ్యురోక్రాటిక్ పెట్టుబడిదారీ విధానం

(పేరులేని గీతం)

అంటే నీకు సంకెళ్ళేశారు, నిన్ను బంధించారు!

నాకోపం మండిపోతుంది
భగ్గున మండిపోతుంది, భగభగ మండుతుంది!
ఇంత నీలంగా మండే మంట మరేదీ లేదు
నా వేదనే దానికి ఇంధనం మరి
ఈ మంటను చల్లార్చడానికి
నేను కన్నీరు కార్చలేను
మానవత్వానికి తామనర్హులమని
రుజువు చేసుకునే పాలకులను చూస్తూ
హేళనగా నవ్వుతాను

వాళ్లు నిన్ను సంకెళ్ళతో బంధనాలలో
ఉంచుతారు గాని
నీ మాటను బంధించలేరు
అది నిలిచే ఉంటుంది

1978 ఆగస్ట్ 8

మైదానాలు

నేను వరిపొలాల ఆకుపచ్చని వైశాల్యాన్ని ప్రేమిస్తాను
దాన్ని తాకే సూర్యకాంతి
శతకోటి బంగారు మణిపూసల్ని ఆవిష్కరిస్తుంది
నేను చెరకుతోటల బలిష్టమైన ఔన్నత్యాన్ని ప్రేమిస్తాను
దాన్ని తాకే సూర్యకాంతి
బంగారు అద్భుత దండాల తియ్యదనాల్ని ఆవిష్కరిస్తుంది
ఆ మైదానాల మూడ్చుకొచ్చే పవనం
రైతుకూలీల కడగండ్ల లయను మోసుకొస్తుంది
యంత్రాలతో పనిచేయక తప్పని కార్మికులలా
రహదారుల మీదా దుకాణాల లోపలా వినిపించే
లోహ ధ్వనులను నేను ప్రేమిస్తాను
సుదూరాన కనబడే నీలి పర్వతాల్ని నేను ప్రేమిస్తాను
అవి కష్టజీవుల్లో ఆశను రేకెత్తిస్తాయి

పాట :

విప్లవ భేరి

సాహు

మ్రోగిందోయ్ .... మ్రోగిందోయ్
విప్లవభేరి మ్రోగిందోయ్
సాయుధభేరి మ్రోగిందోయ్
మనకున్న, లేకున్నగాని
పెరిగేటి ఈ పిల్లలకైనా
దోపిడి, పీడన దుఃఖంలేని
నవ సమాజ నిర్మాణం చేయగ
"మ్రోగిందోయ్॥

తరతరాలుగా సాగేదోపిడి
పీడక శక్తుల పీక నులుమగా
వర్గపోరు ఏకైక మార్గమనీ
నక్సల్‌బరిలో నవ కేతనమై
॥మ్రోగిందోయ్॥

శ్రీకాకుళంలో గిరిజన వీరులు
అటవికన్యాయం సాగదికంటూ
చీమలు పాముల చంపిన రీతిని
భూస్వామ్యం మెడ విరికిందోయ్
"మ్రోగిందోయ్"

చీకటి రోజుల పాలన ఇంక
చెల్లదు, చెల్లదు చెల్లదనంటూ
చిరుదీపాలై వెలిగిన రీతిని
వేకువ వెలుగై లేచిరి జనులు
"మ్రోగిందోయ్॥

వెట్టి చేయమని లంచం దండగ
కట్టం కట్టం కట్టమికంటూ
దొరతనాలను తన్ని తరుముతూ
తెలంగాణాలో తరగలెత్తుతూ
॥మ్రోగిందోయ్॥

భూములు మావని సంపద మాదని
ఊర్లకు, ఊర్లు చీమలదండై
సంఘంలోన సంఘటితమై
శ్రీమజీవులదే పాలన హక్కని
॥మ్రోగిందోయ్॥

బొగ్గుగనుల్లో, మృత్యుగుహల్లో
అణగారిన ఆ కార్మిక వీరులు
సింగరేణిలో పోరుసైరనై
ఎత్తిరి మనదగు పోరు పతాకను
॥మ్రోగిందోయ్॥

మైదానాల్లో విప్లవ జ్వాలలు
ఎగిసెను అడవుల గుండెల్లోన
ఎర్రసేన నిర్మాణం చేయగ
బస్తరుకొండల బందూకెత్తుతూ
॥మ్రోగిందోయ్॥

పీడిత తాడిత జన సందోహం
ఎర్రని రక్తపు బాటలు వేస్తూ
ఎర్రజెండలె ఎత్తిపట్టుకొనీ
విప్లవ పోరుకు సారథి కమ్మని
॥మ్రోగిందోయ్॥

పీడిత ప్రజల ప్రియతమ జెండా
సకల దేశముల శాంతిని కోరుతూ
యుద్ధపు బాధలు లేని జగతికై
అరుణారుణమై ఆకశమంటుతూ
॥మ్రోగిందోయ్॥

కవిత :

ఉద్దానం - మైదానం మధ్య

రాజశేఖర్

ఇక్కడ సమస్యలు
రాజుకొని మంటలు పుట్టిస్తాయి
ఇక్కడ ప్రతి అవసరం ఒక సమస్య
ప్రతి సమస్య ఒక పోరాటం
రాజీలు, మతలబులు
సమస్యను నాన్చలేవు
చర్చలు, సంప్రదింపులు
మంటల్ని చల్లార్చలేవు
నోటి మాటతో ప్రారంభమైన!
నీటి పోరాటం
సుడులు తిరిగి
సాయుధ స్థాయి అందుకున్నా వింతకాదు
పోరుగడ్డ బొడ్డపాడు మొదలుకొని
యుద్ధభూమి ఉద్దానం అనుకొని
'మార్పు' మదనాపురం
వీరగున్నమ్మ రాజపురం
మారు మూల పల్లె మొదలు
రక్తం చిందిన రంగమేటియ వరకు
ఎటువైపు విన్నా ఒకటే నినాదం
'మాకు నీరు కావాలి!'
"కొండ సెలయేరు పాయలు
పొలాలకు మళ్ళించండి
ఆనకట్టతో మా దప్పిక తీర్చండి"
రైతాంగం అర్థించలేదు!
ప్రజా గర్జనలా నినదించింది!

బండెడు అబద్ధం - చిటికెడు సత్యం

సురా

ఆధునిక సమాజంలో ప్రచార సాధనాలు విచిత్రమయిన గందర గోళాన్ని సృష్టిస్తుంటాయి. ఒకవైపు ఇవి పాలక వర్గాల ఆధిపత్యంలో ఉంటాయి. మరోవైపు ఇవి వాళ్ళకి వ్యతిరేకంగా వార్తలనో వ్యాఖ్యలనో ప్రచురిస్తుంటాయి. ఫలితంగా ఆచరణలో వాటిపట్ల తమ వైఖరి ఎలా ఉండాలో ప్రజాశక్తులు తేల్చుకో లేక పోతుంటాయి. గత కొన్ని సంవత్సరాలుగా మన దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రచార సాధనాలు సృష్టించిన ఈ గందర గోళంలో కొంత స్పష్టతని అన్వేషించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

విశ్వ విద్యాలయాలలో రాజనీతి పాఠాలు చెప్పే పంతుళ్ళ శాస్త్రం ప్రకారం ఆధునిక రాజ్యానికి ఎగ్జిక్యూటివ్, పార్లమెంట్, కోర్టు మూడు స్తంభాలయితే నాలగవ స్తంభం పత్రికలు, రేడియో, టివి వగయిరా ప్రచార సాధనాలు. (ఐదవ స్తంభంగా ట్రేడ్ యూనియన్లనీ గుర్తించాలని అమెరికన్ రాజనీతి శాస్త్రజ్ఞులు వాదిస్తున్నారుగాని ఒప్పుకోవడానికి మార్గరెట్ థాచర్ కి తీవ్రమయిన అభ్యంతరాలే ఉండాలి. గత తొమ్మిది నెలలుగా జరుగుతున్న బ్రిటన్ బొగ్గుగని కార్మిక సమ్మె ఆవిడ పక్కలో ఐర్లండ్ తాంబ్ కంటె బలమయిన బల్లెమయి కూచుంది). అభివృద్ధి

సమస్య పక్కదోవ పట్టాలని
కాళ్ళబేరంకి దిగిన కాగితం పులి కుట్ర పన్నింది
అసంపూర్తి హామీలు, చిట్కాలు, చదరంగం ఆటలు
అవిచూసి సంతృప్తి పడ్డ కొందరు
ఉమ్మడి వేదిక నుండి ఒక్కొక్కరు జారుతున్నారు
పసిగట్టిన 'తీవ్రవాది'
ఉద్యానం - మైదానం మధ్య నడుంకట్టి
పదునైన ఆయుధంతో ముందున్నాడు.

(నీటి సమస్యపై 'సోంపేట' రైతాంగం జరుపుతున్న అవిశ్రాంత పోరాటం ఈ కవితకు ప్రేరణ.)

చెందిన పెట్టుబడిదారీ సమాజంలో ఈ ప్రచార సాధనాలు ప్రభుత్వాల నుండి స్వతంత్రంగానే వ్యవహరిస్తుంటాయి. వాటర్ గేట్ వ్యవహారంలో అమెరికన్ పత్రికలు, ఫాక్‌లాండ్ యుద్ధ సమయంలో బి.బి.సి. తమ తమ ప్రభుత్వాలను లక్ష్యపెట్టకుండానే వార్తలను, వ్యాఖ్యలను అందించాయి అయితే ఈ స్వతంత్రత ప్రభుత్వాల నుండేనా, పాలక వర్గాల నుండి కూడానా? ఈ ప్రశ్నకు సమాధానం ఆ ప్రచార సాధనాలన్నీ వెతికినా దొరకదు. ఆయా దేశాలలో ఉన్న ప్రత్యామ్నాయ ప్రచార సాధనాలు వెతికితే దొరుకుతుంది. వియత్నాం యుద్ధంగురించి 'మంత్లీ రివ్యూ' పత్రికలో దొరుకుతుంది. ఐర్లండ్‌గురించి 'న్యూ లెఫ్ట్ రివ్యూ'లో దొరుకుతుంది. పాలకులకి, ప్రజలకి, పీడితులకి, పీడకులకు మధ్యఉన్న వైరుధ్యం 'ప్రమాదకరమయిన' పరిస్థితి చేరుకునేదాకా ప్రచారసాధనాల పరాధీనత వెతికినప్పుడే దొరుకుతుంది కాని కొట్టవచ్చినట్టు కన్పడదు.

కొంతమేరకు ఆర్థిక పునాదిలోనూ, చాలావరకు సంస్కృతిలోనూ భూస్వామ్య ఆధిపత్యం కొనసాగుతూ పీడకులకు పీడితులకు మధ్య వైరుధ్యం సంక్షోభస్థాయికి, కొన్ని ప్రాంతాలలో పోరాట దశకు చేరుకున్న మన దేశం మాటేమిటి?

మనదేశంలో రేడియో, టెలివిజన్ ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్నాయి. దేశంలో ఉన్న 64 శాతం నిరక్షరాస్యులకి చేరాలంటే ఇవి ఒక్కటే మనకున్న ప్రచార సాధనాలు. పేరుకు అభివృద్ధి కార్యక్రమాల వార్తలు, విద్య, విజ్ఞానం వగయిరా ఎన్ని లక్ష్యాలని ప్రకటించినా, ఈ ప్రభుత్వ ప్రచార సాధనాలు సినిమాలతోనూ వాటి పాటలతోనూ మాత్రమే ప్రజల్ని ఆకట్టుకుంటాయి. ప్రజలు కూడ వాటివల్లే వీటికాకర్షితులవుతుంటారు. కాలక్షేపానికి, వినోదానికి సినిమా తప్ప మరే ఇతర సాధనం లేకుండాపోతున్న సమాజ సాంస్కృతికపతనంలో ప్రజలకి ఇవి 'అవసరం' కూడా అవుతాయి. అయితే ఈ క్రమంలో వార్తలద్వారా ప్రత్యక్షంగానూ, ఇతర కార్యక్రమాల ద్వారా పరోక్షంగానూ సమాజంమీదా, సంఘటనలమీదా ప్రభుత్వ దృక్పథాన్ని అవి ప్రచారం చేస్తుంటాయి. ఆ ప్రచారం ప్రత్యక్షంగా, మొరటుగా జరిగేక్రమం పెరుగుతున్నకొద్దీ ప్రజలలో వీటిమీద విశ్వాసం తగ్గుతూ పోతుంటుంది. ఇందిరాగాంధి ఈ రెండు సాధనాలని వ్యవస్థకి, ప్రభుత్వానికి మాత్రమేకాక ప్రత్యేకించి తన కుటుంబ వ్యక్తిగత ప్రచారానికి వినియోగించుకొని వాటిని మరింత దిగ్

నామ్ చేసింది. ఏ ప్రాంతంలోనయినా సంక్షోభం తీవ్రమైనప్పుడు ఆ ప్రాంత ప్రజలకి వాటిమీద విశ్వాసం పూర్తిగా పోతుంది. వాళ్ళు ఇతర దేశాల రేడియో, టి.వి.లనయినా వింటారుగానీ ప్రభుత్వవాణిని అసలే నమ్మరు. 1983లో అస్సామ్‌లోనూ, 1984లో పంజాబ్‌లోనూ అదే జరిగింది. ప్రభుత్వ ప్రచార సాధనాల విశ్వసనీయత కాలం గడుస్తున్నకొద్దీ తగ్గిపోతూ వస్తోంది. నిజానికి ఇది మొత్తంగా రాజ్యం (STATE) తన సాధికృత (legitimacy) ని కోల్పోతున్న క్రమంలో భాగం.

పదిహేనేళ్ళ క్రితం ప్రజలకి తమ జీవన పరిస్థితులు బాగుచేసుకోవడానికి, రాజకీయాధికారం వహించడానికి ఎన్నికలు పనికిరావని నక్సల్‌బరి ప్రకటించింది. ఇప్పుడు తమ పాలనను కొనసాగించడానికి ఎన్నికలు పనికిరావని అస్సాంలోనూ పంజాబ్‌లోనూ పాలకులే ప్రకటించారు. ఇరువైపుల ఎన్నికల ప్రజాస్వామ్యం తెర తొలగుతోంది. ఈ పదిహేనేళ్ళ కాలంలో ఎన్నికల పార్టీలన్నీ బద్‌నామ్ అయ్యాయి. వంద సంవత్సరాల అనుభవంగల కాంగ్రెస్ పార్టీ నుండి రెండుసంవత్సరాల తెలుగు దేశందాకా అందరికీ ఒకేరకమైన అనిశ్చితపరిస్థితి. అత్యధికమెజారిటీతో గెలిచినపార్టీ కూడా ఐదేళ్ళు అధికారంలో ఉంటుందని గ్యారంటీ లేకుండా పోయింది. ఈ ప్రహసనంలో పాల్గొన్న వ్యక్తులు ప్రజల్ని ఆకర్షించలేక పోతున్నారని ఇతర నాటకాలలో పేరొందిన వ్యక్తులు ఈ రాజకీయరంగంలోకి ప్రవేశిస్తున్నారు. అయితే సినిమా నటులు ఈబద్‌నామ్‌అయ్యే క్రమాన్ని ఆలస్యం చేయగల్గుతున్నారేమోగాని, నివారించ లేరని తమిళనాడు, ఆంధ్ర రాజకీయాలు రుజువు చేస్తున్నాయి.

వర్గ సమాజంలో వైరుధ్యాల్ని "శాంతియుతంగా" పరిష్కరిస్తూ దోపిడీకి, నియంతృత్వానికి ప్రజామోదాన్ని, పొందడంకోసం రాజ్యాంగం ఏర్పరిచిన రాజకీయ సాధనమయిన ఎన్నికలకి ఈ గతి పడ్తుంటె మరి పాలకుల ప్రయోజనాలేంగానూ! అక్కడే మనం పత్రికల పాత్రను పరిశీలించాలి.

ఇటీవల కాలంలో, ముఖ్యంగా అత్యయిక పరిస్థితి ఎత్తివేసిన నాటి నుండి పత్రికలు పార్లమెంటరీ వ్యవస్థలో ప్రతిపక్షాలు నిర్వహించాల్సిన పాత్రను నిర్వహించడం మొదలెట్టాయి. గడిచిన పార్లమెంటులో ప్రతిపక్షాలు గొడవచేసి ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టిన ప్రతిసమస్య పత్రికలద్వారానే వెలుగులోకి వచ్చింది పార్లమెంటు సమావేశాలపై పత్రికలు నిర్ణయాత్మక ప్రభావాన్ని చూపించగలిగాయి.

ఆ పనిని విజయవంతంగానూ, విశ్వసనీయతతోనూ చెయ్యడానికి కొంతమేరకు ఎన్నికల రాజకీయాల దుర్గతిని అవి ఆమోదించాయికూడా. ఇప్పటి వరకు తమ సాధికృతను కోల్పోయినవాటి ఈ దుర్గతిని గుర్తించకపోతే ఈ పత్రికల విశ్వస నీయతకే ప్రమాదం. రేడియో, టివిలు గుర్తించనిరాకరించే వైఫల్యాన్ని పత్రికలు ప్రచురించి ప్రచారం చేయకపోతే వాటినెవరూ నమ్మరు. అవి అమ్ముడుపోవు. అయితే ఈ పనిని మన పత్రికలు కొంచెం తెలివిగా నిర్వహిస్తున్నాయి. వ్యవస్థ మంచిదే, కాని అందులో ఉన్న వ్యక్తులు మంచివాళ్ళుకారు అనే భావనని కలిగి స్తుంటాయి. అంతులే అవినీతిపరుడన్న విషయం ఎంత పెద్ద ఎత్తున ప్రచారం జరిగిందంటే వసంతదాదాపాటిల్ కాదనే విషయం పరోక్షంగా మనకు కలిగించేదాకా జరిగింది. పంజాబ్‌లో ఇందిరాగాంధి కాక మరెవరయినా ఉన్నా, ఆతడే ఇంకొక రకంగా వ్యవహరించినా పంజాబ్ సమస్య పరిష్కారమయ్యేదన్న జరిగే ప్రచారం అలాంటిదే. 36 సంవత్సరాల దేశ రాజకీయార్థిక పరిణామక్రమ సంక్షోభ రూపం పంజాబ్ అనే అసలు విషయాన్ని ఆ ప్రచారం మరుగున పెట్టింది. ప్రస్తుతం ఉన్న రాజకీయ చట్టంలో పంజాబ్ ఇలా తప్ప మరోలా పరిణమించే అవకాశంలేదు.

ఈ రాజకీయ వార్తలు, వ్యాఖ్యలు మాత్రమేకాక పత్రికలు సమాజంలో ఉన్న దోపిడికి, నిర్బంధాలకి వ్యతిరేకంగా జరిగే పోరాటాలకి ఉండుండి పెద్దఎత్తున ప్రాముఖ్యతను కూడ ఇస్తుంటాయి. పరిశోధనాత్మక పత్రికా వ్యాసంగం (Investigative Journalism) అనే పేరుతో వెలుగులోకి వచ్చిన ఈ రిపోర్టులు ఇటీవల కాలంలో కొద్దిపాటి తేడాలతో అన్ని పత్రికలలోనూ భాగం చేసుకున్నాయి. ఈరిపోర్టుల వెనక అంతర్లీనంగా ఒక వ్యాపారకాంక్ష మొదటి నుండీ ఉంది. చదివే వాళ్ళ సంఖ్యకంటే మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన పత్రికల సంఖ్య ఎక్కువ గా పెరగడంతో పోటీ పెరిగింది. పాఠకులను ఆకట్టుకోవడం కోసం ఈ పరిశో ధనాత్మక వ్యాసంగం ఒక సాధనమయింది. అయితే క్రమంగా ఇందులో పరిశోధన పత్రికా వ్యాసంగం పోయి వ్యాపారం మాత్రమే మిగిలిపోతోంది. బీహార్‌లో ఏళ్ళతరబడి జైళ్ళల్లో మగ్గుతున్న ముద్దాయిలు, ఉత్తరప్రదేశ్‌లో దళితులపై అత్యా చారాలు, మధ్యప్రదేశ్‌లో పెన్సిలిన్ ఫ్యాక్టరీలలో కార్మికులు మొదలయినవిపోయి, పూలన్‌దేవివంటి వాళ్ళు కథావస్తువు లవుతున్నారు.

ఈ పతన క్రమానికి అతీతంగా పత్రికలు అప్పుడప్పుడు ప్రజల జీవితాల గురించి, పోరాటాల గురించి వార్తలు ప్రచురించకుండా పోవడంలేదు. ఈ రిపోర్టులను పెరుగుతున్న పోటీకి అతీతంగా అర్థం చేసుకోవడం కష్టం. అదీకాక ఈ వార్తలను పూర్తిగా నిషేధిస్తే రేడియోగతే పత్రికలకు పడుతుందనే వాస్తవం వాటికి తెలుసు. అయితే ఈ రకం పోరాట వార్తలు ఒకటి ప్రచురించి, అందుకు విరుద్ధమయినవార్తలు మరిన్ని ప్రచురించి తమ "ప్రాణన్ని" పరిహారం చేసుకోవచ్చు. కరీంనగర్ జిల్లాలో రాడికల్స్ సారా కంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యారనే 'వార్త' రేడియోకూడా చెప్పలేదు. అంతకుముందు అదే జిల్లాలో ఫకీర్ కొండాపూర్‌లో తోకల చినవెంకటిని పోలీసులు కొట్టి చంపారని వార్త ప్రచురించిన పత్రికలో అదే విలేఖరి రాసాడు. ఈ విరుద్ధ విధానాల మధ్య ఊగిసలాటవల్లే పత్రికలు గందరగోళాన్ని సృష్టిస్తుంటాయి.

రాజకీయార్థిక సంక్షోభం, పెట్టుబడి, విశ్వసనీయత ఈ మూడు అంశాల నేపథ్యంలో మనం తెలుగు పత్రికల గురించి చర్చించుకోవచ్చు. తెలుగులో ప్రస్తుతం 17 దినపత్రికలున్నాయి. అయితే వాస్తవానికి పరిగణనలోకి వచ్చేవి 4 మాత్రమే. (ఈనాడు, ఆంధ్రపత్రిక, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి ఆ వరుసలో). వీటి మొత్తం సర్క్యులేషన్ సుమారు ఆరు లక్షలు. కొనేవాళ్ళ సంఖ్య ఆరు లక్షలంటే చదివే వాళ్ళ సంఖ్య 30 లక్షలు. అంటే రాష్ట్ర జనాభాలో సుమారు 5 శాతం, రాష్ట్రంలో అక్షరాస్యులు 30 శాతం ఉన్నా, ఇందులో రోజువారీ జీవితంలో చదవడం జ్ఞాపకం ఉన్నవాళ్ళు, అలవాటయినవాళ్ళు 15 శాతంకంటే ఎక్కువ ఉండరు. ఇందులోనూ సాంస్కృతికంగానూ, ఆర్థికంగానూ దినపత్రిక చదవగలిగేవాళ్ళు ఇంకా తక్కువ. అంటే రాష్ట్ర జనాభాలో పత్రికలకి పాఠకులు పెరిగే అవకాశం తక్కువ. మన రాష్ట్రంలో గత దశాబ్దకాలంలో జనాభా 25 శాతం పెరిగింది. అక్షరాస్యుల సంఖ్య 5 శాతం పెరిగింది. పత్రికల సర్క్యులేషన్ 50 శాతం పెరిగింది. ఇక పెరిగే అవకాశాలు తక్కువ. అంటే పత్రికల మధ్య పోటీ తీవ్రమవక తప్పదు. పత్రికా రంగంలో పెట్టుబడి పెరుగుతున్నకొద్దీ ఈ పోటీ మరింత పెరుగుతుంది

మన రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దిన పత్రికలలో ఆంధ్రపత్రిక రాష్ట్రేతర వ్యక్తుల యాజమాన్యంలో ఉంది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ పత్రికలు తప్ప ఇతర పరిశ్రమలు లేని ఏకైక గ్రూపు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపు. దేశవ్యాపి

తంగా ఒక ఇంగ్లీషు దిన పత్రిక, ఆరు ప్రాంతీయ దిన పత్రికలు, ఐదు వారపత్రికలు ఈ గ్రూపు నడుపుతోంది. రాజకీయంగా మొత్తం అన్ని పత్రికలు ఒక విధానాన్ని అనుసరించకుండా వివిధ పార్టీల మధ్య బ్యాలెన్స్ చేస్తుండటం ఈ గ్రూపు లక్షణం. మొత్తంగా ఇందిరా కాంగ్రెస్ వ్యతిరేకత మాత్రం ఉన్నట్టు కన్పిస్తుంటుంది. ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి వ్యవసాయరంగం నుండి వచ్చిన అదనపు విలువతో పెట్టిన పత్రికలు. ఈ రెండు పత్రికల యజమానులూ ఇందిరాకాంగ్రెస్ పార్లమెంటు సభ్యులు. ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి పత్రికలేగాక ఇతర పరిశ్రమలు కూడా ఉన్నాయి. స్వభావరీత్యా ఈ రెండు పెట్టుబడులు సాంప్రదాయకమయిన పెట్టుబడులు. వ్యాపారపంటలు, వ్యవసాయక రంగంమీద ఆధారపడిన పరిశ్రమలు మొదట్లో ఈ పెట్టుబడిని ఆకర్షించాయి. ప్రస్తుతం పదార్థఉత్పత్తి లేని పరిశ్రమలలోకి (సినిమాలు, పత్రికలు వగయిరా) ఈ పెట్టుబడి కూడ రాకతప్పడం లేదు. రాజకీయంగా ఈరెండు పత్రికలు కాంగ్రెసుని సమర్థించినా, ఆ పనిని ఆంధ్రభూమి మరింత మొరటుగా చేస్తుంటుంది. ప్రస్తుతం అది ఇందిరా కాంగ్రెస్ అనధికారవాణి.

70 లలో ఈనాడు వచ్చింది. చిట్‌ఫండ్ కంపెనీ నుండి లాభాలు సంపాదించిన యాజమాన్యం పత్రికారంగంలోకి ప్రవేశించింది. ఇంతకు ముందెన్నడు లేనంత పెద్దపెట్టుబడి ఈపత్రికలో పెట్టబడింది. తూర్పు ఆంధ్రాలో దినపత్రికచేరని ప్రాంతాలలో దినపత్రిక చదివే అలవాటుని అలవరుస్తూ మార్కెట్ పరిధిలోకి కొత్త పాఠకులని తీసుకొచ్చింది. వార్తలలోనూ, వ్యాఖ్యలలోనూ కొత్తరకం రిపోర్టింగ్‌ని ప్రవేశపెట్టింది వార్తలను సేకరించడంలోనూ, ప్రచురించడంలోనూ పత్రికను మారుమూల గ్రామాలకు చేరవేయడంలోనూ పెద్దమొత్తంలో పెట్టుబడిప్రవేశించింది. ఆధునిక టెక్నాలజీ వచ్చింది. కొత్త నిర్వహణ పద్ధతులు వచ్చాయి. పెట్టుబడి తీసుకొన్న ఈచొరవని చాలామంది అభ్యుదయవిధానమని భ్రమపడ్డారుకూడా. క్రమంగా ఇతర ప్రాంతాలకు వ్యాపించి ప్రస్తుతం మూడున్నరలక్షల సర్క్యులేషన్‌తో అందరికంటేముందుంది. ఈలోగా ఈనాడు యాజమాన్యం ఇతరరంగాలలోకికూడా వ్యాపించింది. అడ్వర్‌టైజింగ్ కంపెనీ, పచ్చళ్ళ ఫ్యాక్టరీ, హోటళ్ళు, సినిమాలు వగయిరాలలో ప్రవేశించింది వస్తు ఉత్పత్తి లేకుండా, ప్రభుత్వం, బ్యాంకులు ఇచ్చేరుణాలతో ద్రవ్య పెట్టుబడితో అతి త్వరితంగా అభివృద్ధి చెందే ఈరకం యజమానులే ఇక్కడ

ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా అందరికంటే ముందున్నారు. మదుపుపెట్టిన మొత్తం టెక్నాలజీ, నిర్వహణ పద్ధతులలో వీళ్ళ చొరవ సాంప్రదాయక యజమానులను తెలివిగా వెనక్కి నెట్టింది. ఈనాడు రాజకీయంగా ఎన్. టి. రామారావుని, తెలుగు దేశం పార్టీని సమర్థించింది. ఆ సమర్థించడంలో కూడా సాధారణంగా దిన పత్రికలు పాటించే నియమాలన్నింటినీ ఉల్లంఘించి పరిశ్యక్ష అధికార కరపత్రం అయింది. వార్తలను సంచలనాత్మకంగా ప్రచురించి, లేనప్పుడు సంచలనాత్మక వార్తలను సృష్టించి దినపత్రికా వ్యాపంగానికి మసాలా పత్రికారచన (Yellow Journalism) మధ్య ఉన్న దూరాన్ని తగ్గించింది. ఆక్రమంలోనే పత్రిక యజమానులకి ఉద్యోగస్తులకి మధ్య కొత్తరకం సంబంధాలను ఏర్పరిచింది. యజమాని సంపాదకుడుగా చెలామణీ అయ్యే సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టింది. సంస్థలో యూనియన్ కార్యకలాపాలని అతి హేయమైన పద్ధతులలో అణచివేసింది మనదేశంలో పత్రికలకున్న పాటి స్వాతంత్ర్యాన్ని అధికారపార్టీకి తాకట్టుపెట్టి ఆ క్రమంలో ఉద్యోగస్తులని కట్టుబానిసలనుచేసింది. ప్రస్తుతం పోరాటం జరుగుతున్న ప్రాంతాలలో పోలీసు అధికారులు తమ పత్రికగా భావించే స్థితికి దిగజారింది.

అయితే 'ఈనాడు'కు పోటీగా కొత్తగా మరో దినపత్రిక 'ఉదయిం'చింది. మరింత పెద్దమొత్తంలో పెట్టుబడి ప్రవేశించింది. అత్యాధునిక టెక్నాలజీని ప్రవేశపెడ్తోంది. ఇది ఒక ప్రముఖ సినిమా దర్శకుడి పెట్టుబడి. స్వభావరీత్యా ఈ పెట్టుబడి "ఈనాడు" కోవకు చెందినదేగాని, అంతకుముందున్న సాంప్రదాయక యజమానుల కోవకు చెందినది కాదు. ఈ రెంటికిమధ్య పోటీకి నీతినియమాలుండే అవకాశం లేదు.

ఇంత పెద్దమొత్తాలలో పెట్టుబడి పత్రికారంగంలోకి ఎందుకు ప్రవేశిస్తున్నట్టు? ఇతర రంగాలలో అవకాశాలు తక్కువ కావడం ఒక కారణం కావచ్చు. కానీ అంతకంటే ముఖ్యమయిన కారణం రాజకీయ పలుకుబడి. ఈ రాజకీయ పలుకుబడి సహాయంతో ఇతర రంగాలలోకి వ్యాపించవచ్చుకూడా. రాజకీయ పార్టీలతో నిత్య సంబంధాన్ని, ప్రభుత్వ యంత్రాంగంలో అన్నిస్థాయిలలోనూ సంబంధాల్ని. మొత్తం సమాజాన్ని ప్రభావితంచేసే శక్తిని పునాదిగా ఏర్పరుచుకొని ఎవరయినా రాజకీయంగానూ, ఆర్థికంగానూ వేగంగా అభివృద్ధి చెందవచ్చు.

ఆదాయం రీత్యా పత్రికలకు 60-70 శాతం ఆదాయం వ్యాపార ప్రకటలనుండి వస్తుంది. అందుకనుగుణంగానే పత్రికలలో 60-70 శాతం ప్రకటనలుంటాయి. కాని అమ్మకాలనుండి మిగతా ఆదాయం వస్తుంది. స్థిరమయిన అమ్మకం ఉంటేగాని వ్యాపార ప్రకటనలు క్రమం తప్పకుండా ఆదాయం ఇవ్వలేవు. (ఎవరూ కొనుక్కోని పత్రికలో ప్రకటన ఇవ్వడం దండగ కదా!) అంటే అంతిమ పరిశీలనలో వార్తలు, వ్యాఖ్యలు పత్రిక అమ్మకాన్ని ప్రచారాన్ని నిర్ణయిస్తాయి.

వార్తలు, వ్యాఖ్యల విషయంలో రెండు అంశాలని పరిగణనలోకి తీసుకోవాలి. విశ్వసనీయత (Credibility), సంచలనాత్మకత (Sensationalism) చదివే వార్తలను వ్యాఖ్యలను పాఠకులు విశ్వసించకపోతే పత్రికలు అభివృద్ధి చెందవు. ఈ విశ్వసనీయత లేక పోవడం వల్లే రేడియో పతనం అయింది. దిన పత్రికలు అధికార రాజకీయపార్టీలకు అనధికార బాకాలు కావడం ఈవిశ్వసనీయతను పోగొట్టుకునే క్రమమే. ఓట్ల రాజకీయాలలో ఆ పార్టీల పరిస్థితే అనిశ్చితమవుతుంటే వాటి దినపత్రికల పరిస్థితి అలాగే తయారయ్యే ప్రమాదం కూడా ఉంది. అయితే కేవలం విశ్వసనీయత మాత్రమే ప్రమాణంగా పత్రికలు అమ్ముడుపోవు. ఇతర కారణాలు అనేకం కూడా పనిచేస్తాయి. ఉదాహరణకి మన రాష్ట్రంలో మూడోవంతు పాఠకులకి ప్రతిఉదయం ఇతర పత్రికల కంటే ముందుగా 'ఈనాడు' చేతి కొస్తుంది. కేవలం ఈ డిస్ట్రిబ్యూషన్ సౌకర్యంవల్లకూడా పత్రికలు అమ్ముడు పోవచ్చు. (మద్రాసులో హిందూ, కలకత్తాలో అమృత్‌బజార్ పత్రికలకుకూడా ఈ సౌకర్యం ఉంది). అయితే ఈ కారణాలన్నింటికంటే ప్రస్తుతం సంచలనాత్మకత పత్రికలమ్ముడు పోవడంలో నిర్ణయాత్మక పాత్రని నిర్వహిస్తోంది. నాటకీయమయిన సంఘటనలు, హింస, సెక్స్ మసాలా కథలు, తెరవెనక రాజకీయ వ్యథలు వ్యక్తుల గురించి నిందారోపణలు మొదలయిన "వార్తల"తో పాఠకులను ఆకట్టుకోవడం ఈ రకం పత్రికా వ్యాపార లక్షణం. మొదట్లో దీన్ని ప్రవేశపెట్టింది 'ఈనాడు' అయినా ప్రస్తుతం అన్ని దినపత్రికలు దీనికలవాటయిపోయాయి. పీడిత ప్రజానీకంపై జరిగే నిర్బంధాలయినా, అత్యాచారాలయినా పత్రికలవాళ్ళకి అందుకే పనికి వస్తాయి. ఆ క్రమంలోనే పోలీసు లాకప్‌లో మానభంగానికి గురికాబడిన పేద స్త్రీ, భూస్వామి చేత కాల్చి చంపబడిన హరిజనుడుకూడా వార్తలలోకి ఎక్కి ప్రాముఖ్యతను సంపా

దించుకోగలిగారు. (ఇక్కడ చిన్న మాయ ఒకటుంది. పెట్టుబడికీ వ్యాపారానికీ పనికొచ్చే ఈ వార్త రాసే విలేఖరి సాంఘిక చైతన్యంతో రాయవచ్చు. తనదగ్గర పనిచేసే శ్రామికులు తాము చేసే శ్రమను తమ చైతన్యానికి, ప్రయోజనానికి అనుగుణంగా ఉందని భావించనంతకాలం ఆ పని వాళ్ళు మరింత సమర్థవంతంగా చేయగలరు. ఆ రకంగా వాళ్ళు భావించడం ఆ శ్రమ వెనకాల ఉన్న సాంఘిక సంబంధాన్ని మరుగున పెడ్తుంది. పెట్టుబడి, టెక్నాలజీ, శ్రమ, ఉత్పత్తి, మార్కెట్ అదనపు విలువ పైకి కన్పడవు. పని చేసేవాడు తాను ఆ పని ఎందుకు చేస్తున్నాడని భావిస్తాడో అది ఒకటే కన్పిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది తప్పుడు చైతన్యం. విలేఖరుల తప్పుడు చైతన్యం పత్రికాధిపతులకు లాభాన్ని, పాఠకులకు గందరగోళాన్ని కలుగచేస్తుంది) ప్రచురించే వార్తలలోనేకాక, అవి ప్రచురించిన పద్ధతిలో కూడా ఈ సంచలనాత్మక దృష్టి ప్రతిఫలిస్తుంటుంది. మొత్తంగా ఈ రకం ధోరణి పత్రికా వ్యాసాంగాన్ని పచ్చి వ్యాపారకళ స్థాయికి దిగజార్చివేస్తుంది. ప్రస్తుతం మన దిన పత్రికలన్నీ ఈ దారిలోనే ఉన్నాయి.

ఆర్థికంగా పెట్టుబడి, రాజకీయంగా విశ్వసనీయత, వ్యాపారకళగా సంచలనాత్మకత, తప్పుడు చైతన్యంగా పనిచేసే వాళ్ళ సామర్థ్యం. అన్నీ సంక్షోభస్థాయికి చేరుకున్నప్పుడు ఈపత్రికలు మరణశయ్యకు చేరుకుంటాయి. ఇది ఆయా పత్రికలకు విడిగా జరగవచ్చు. కాని మొత్తంగా ఈ క్రమాన్ని చుట్టు ఉన్న సమాజం నిర్ణయిస్తుంది. వ్యవస్థలో సంక్షోభం, రాజ్యం సాధిక్యత, ప్రజా చైతన్యాన్ని పదునుపెట్టే వర్గ పోరాటం అంతిమ పరిపాలనలో ఈ పత్రికల స్థితిగతుల్ని నిర్దేశిస్తాయి. అప్పటి దాకా పెట్టుబడి, పోటీ రాజకీయ విధానం, విశ్వసనీయత, సంచలనాత్మకత పరస్పర విరుద్ధంగా పోతున్నట్టు కన్పిస్తుంటాయి స్పష్టంగా ప్రజా వ్యతిరేక స్వభావం కొట్టొచ్చినట్టు కన్పడదు. పైగా అడపాదడపా ప్రజా పోరాటాలకు అనుకోని సహాయం చేస్తున్నట్టు కన్పించవచ్చుకూడా.

ఈసంధి సమయంలో ఈపత్రికలపట్ల ప్రజాశక్తుల దృక్పథంలో కొంతఅస్పష్టత అనివార్యం. అయితే ఈలోగా ఈ పత్రికలను విమర్శనాత్మకంగా చదివే చైతన్యాన్ని అలవర్చుకోవాలి. (ఏ పత్రికయినా ప్రత్యక్షంగా పోరాట వ్యతిరేకతని ప్రదర్శించే దాకా ఆ పత్రికను విశ్వసిస్తూపోవడం ఈ విమర్శనాత్మకత లోపించడంవల్లే జరుగు

మరో సారా కథ

కార్మిక

మా అయ్య సారా తాగి తాగి సచ్చిండు. చావకముందు మా అయ్య బొగ్గు బాయిల పన్జేసెటోడు. బాయి పనికి పోయిరాంగనె వచ్చేటప్పుడె సవ్వో దోసవ్వో సారాతాగి ఇంటికొచ్చెటోడు. ఎప్పుడైనా పైసలులేక తాగనిరోజు, కాళ్ళుపాయె చేతులుపాయెనంటు కొట్టుకోలు మొత్తుకోలు చేసెటోడు. చివరికి అట్లనో ఇట్లనో చేసి కొని పొయ్యి ఓ సవ్వ ఏసుకొని మళ్ళీ మామూలు మనిషైపోయెటోడు. రాను రాను తాగుడెక్కువై జీతం మొత్తం తాగుడుకె పోయేది. అంతటితో ఆగిపోలె చివరికి ఇంట్లోదొరికిన ప్రతి వస్తువు తీస్కపోయి అమ్ముకొని తాగెటోడు. మా అవ్వ ఎంత మొత్తుకున్నా వినెటోడుకాదు. పైగా తాగొచ్చి గొడ్డును బాదినట్టు బాదెటోడు. చివరికి తాగి తాగి కార్జాలు తూట్లుపడి బొక్కలెల్లి మొఖమంతా వాసిపోయి పెయ్యంతా పచ్చ బడి సచ్చిపోయిండు.

అట్ల మా అయ్య సచ్చిపోయినకాన్నుంచి మాఅవ్వ అందిన కష్టమల్లజేసింది. కూలినాలి చేసింది. ఒక్కపూటతిని మరోపూట తినకుండా మాకు పెట్టింది. నాకప్పుడు తొమ్మిదేండ్లు. నాల్గేండ్ల చెల్లెలొక్కతి ఉండేది. అది ఆ తర్వాత ఏదో రోగంతోని నాల్గురోజులు మంచంల పడి సచ్చిపోయింది. నేను ఒక్కన్నె మిగిలిన.... నేనింత పెద్దోన్నై అయి రెక్కలు ముదిరి సంపాదించక పోతనా అన్న ఆశ ఒక్కటి మాత్రి

తుంటుంది). 'బండెడు అబద్ధాలలో చిటికెడు సత్యాన్ని' చూడగల శక్తిని (అలవర్చుకోవాలి. అందుకు తోడ్పడే ప్రత్యామ్నాయ పత్రికలను అభివృద్ధి చేసుకోవాలి. ప్రస్తుతం మనదేశంలో ఇంచుమించు అన్ని భాషలలోనూ ప్రత్యామ్నాయ పత్రికలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా ఈ రంగంలో ఉన్న రెండు ఇంగ్లీషు వార పత్రికలు (ఫ్రాంటియర్, ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ) గణనీయమైన సేవ చేస్తున్నాయి. ఈ రకం పత్రికలకు వార్తలనందించడంలో, ప్రమాణాలను పెంచడంలో, పాఠకుల సంఖ్యను ఎక్కువ చేయడంలో తోడ్పడాలి.

'బండెడు అబద్ధం కంటే చిటికెడు సత్యం కలిసిన అబద్ధం' ఎక్కువ ప్రమాద కరమయింది.

— డాస్టోవ్‌స్కీ

ముందేదికావచ్చు మా అవ్వకు. కాని నేను బుద్ధిఎర్గేసరికి మా అవ్వకూడ మిగలలేదు. సరిగా తిండి తినక పేగులు మాడ్చుకొని సచ్చింది. నాకప్పుడు పన్నెండేల్లు. ఎటూ దిక్కులేని నన్ను మా అవ్వ పెద్దతల్లి కొడుకు తీస్కపోయి ఇగ్గో గీ సారా కొట్లె నౌకరుంచిండు. అగో అప్పటినుండి ఇదే సారాకొట్లె సారా తాగిన గిలాసలు కడుగుతు, సారా తాగేవారికి పలహారాలందిస్తు వాళ్ళిచ్చిన పావులా పర్కా తీసుకుంటు కాలము గడుపుకుంటు వస్తున్నా నాకిప్పుడు ఇరువైరెండేళ్ళు.

నేను ఈ సారాకొట్లో పన్జేస్తున్నకాన్నుంచి సారా తాగెటోల్లను చూస్తున్న. ఒకొక్కళ్ళను చూస్తె నాకు అసహ్యం పుట్టేది. మరి కొందరిని చూస్తే జాలికల్గేది. క్రమం తప్పకుండా సారా దుకాణం వచ్చేవారు. ఎప్పుడు సారా నిషాలోనే కాలం గడిపెటోళ్ళు. కొత్తగా తాగేటోళ్ళు, ఇంకా మీసం పొడవని కుర్రోల్లు. గోసిపేల్లె లోల్లు పొద్దుందాక మొద్దుకష్టం చేసెటోళ్లు. బొగ్గుబాయిల్ల బండపని చేసెటోల్లు ఇలా రకరకాల వ్యక్తులను రోజు చూస్తుండేవాడిని. క్రమంగా ఒక్కరొక్కరె సారా బాని సలై పోయేటోళ్లు. పొద్దుగూకెదాక రెక్కలు ముక్కలు చేసుకొని సంపాదించిన దాంట్లో సగం కూలి సారాకొట్లోనె ఖర్చు చేసెటోల్లు. సారాకొట్లోకి వచ్చేటప్పుడు మొక్కుతు మూల్గుతు అలసిపోయి వచ్చినవాళ్ళు గుటుక్కున పావో రెండు పావులో మింగి ఒక్కసారి ఒళ్ళు జలదరించుకొని సారా ఘాటుకు తుపుక్కున ఊంచుతు సారా మత్తు తలకెక్కేసరికి 'బంచెత్ నా అంతటోడు లేడంటు బొచ్చె ఉబ్బిచ్చుకుంట బయటికి వెళ్ళిపోయెటోళ్లు. అంతకుముందు ఒక్కమాట మాట్లాడనివాళ్లు అంతు పొంతులేని సంభాషణలు సాగించెటోళ్లు. ఒక్కొక్కరు ఏ కారణం లేకుండానె బోరున ఏడ్చెటోల్లు, నాకిదేమి అర్థమయ్యేది కాదు. ఒక్కొక్కసారి అనిపించేది అసలు వీళ్లు తాగటానికి ముందు గునుసుకుంటు వచ్చిన మనుషులేనా అని కొద్ది క్షణాల్లో ఎంత మార్పు. ఏదో బ్రహ్మరాక్షసి వాళ్ళను సారా సుడిగుండంలో పడేసి పీల్చి పిప్పి చేస్తుందనిపించేది కాని అదేంటో నాకు అర్థమయ్యేది కాదు.

దసరాపండుగొచ్చింది కొత్త మాములాలొచ్చినయి. ఇదివరకున్న సేటుపోయి కొత్త సేటువచ్చిండు. మా తాలూకాలోని సారాపాట పన్నెండులక్షలనుండి పద్దెనిమిది లక్షలకు పెంచిపాడిండు. కొత్తగావచ్చిన సేటు. అంత పాటపాడినసేటుకు పత్తలేమి మిగల్తదో నాకు అర్థంకాలె. ఖర్చు తగ్గించుకోవటం కోసము పాతోల్లను తీసెత్తాడెమో

వని బయపడ్డాను. కాని నా భయం వృత్త భయమేనని తేలిపోయింది. కొత్తసేటు వచ్చినకాన్నుంచి పాత పద్ధతులన్ని మారిపోయినయి. కొత్తగా పన్నెండు మంది వస్తాదుల్లాంటి మనుష్యులు పనిలకు కుదిరిండ్లు. మరె్రండు కొత్తజీబులు ఒక లారి వచ్చినయి. గా కొత్తజీబు వచ్చినప్పుడె గా జీబులా మా కొత్తసేటు వచ్చిండు. గప్పుడె ఆయన్ని చూడటము మళ్ళెప్పుడు ఆయన్ని చూడలేదు. ముప్పయి ముప్పయి అయిదు ఏండ్లుండవచ్చు. చిదుముతె రక్తంకారేలాగున్నడు. షోగ్గా పెంచుకున్న మీసాలు పెదవులకింద వాలి ఉన్నాయి. మల్లెపువ్వులాంటి తెల్లటి బట్టలల్ల దొర తీర్గ ఉన్నడు ఆయన గురించి మావోల్లు ఆ తర్వాత చానా చానా చెప్పిండ్లు. వయసుకు చిన్నోడె అయినా చాల తెలివైనోడు. చాల కష్టపడి పైకొచ్చిండ్లన్నరు. కష్టం గుర్తెరిగి నోడన్నరు. అంతేకాదు ఆయనొకప్పుడు పెద్ద నక్సలైటట కూడా. ఏమైతేం గాని ఆయనొచ్చినప్పుడు మా డిపోల పెద్ద దూడావుడి జర్గింట. ఆ తర్వాత నేను అక్కడ పన్జేసినన్నాల్లు మల్ల రాలేదు. ఆయన తరపున అన్ని వ్యవహారాలు ఆయన మనుష్యులు చూస్తుండెటోల్లు. ఆ తర్వాత డిపో రూపమే మారిపోయింది.

గోదావరిఖనిలో వాడవాడకు సారాయి దుకాణాలు వెల్సినయి. మరీ సెంటర్లో సూడు పానాదులుకాడ్నైతె పదిగజాలకో షాపు ఓపెన్ చేసిండ్లు. మరిన్ని దుకాణాలకు సారా సప్లయి చేయాలంటే గవర్నమెంటు ఇచ్చిన కోటా ఏ మూలకు సరిపోతుంది? నెలలో ఒక వారము కూడారాదు. అందుకే మా శేట్ దొంగతనంగ ఆల్కాహాల్ తెచ్చి సారా చేయించి అమ్మించేవాడు.

ఒక్క సారి రాత్రి రెండింటి దాక పన్జేసి అప్పుడె ఓ కునుకు తీస్తున్న అరె సారిగా లె లె. లేసిపోయి జీబులెక్కు అంటూ నేకప్పుకున్న గోనెతట్టును లాగేస్తండ్లవరో. లేచి కూచున్నాను. నా ఎదురుగా గుబురు మీసాలతోని పొట్టిగా లావుగా ఉన్న అవిశెట్టి కన్పించిండు. 'తొందరగా పో(రెయిడింగ్కు పోతండ్లు. బిరెవజావస్తుదిలె' అంటు ఇంక ఏదో వాగుతూనె ఉన్నడు. అలా వాగినప్పుడు. అతని వద్ది ముక్కును గుబురు మీసాలు కప్పేస్తున్నయి లోతైన చిన్నకండ్లు మరింత మూసుక పోయినయి.

లేచి పోయి జీబులోకూసున్న, నేనెంత సారాకొట్లో పన్జేసెతోన్నయినా ఆ జీబులో కూసునే సరికి తల తిరిగినంత వసయింది. జీబులో ముందు సీట్ల నల్గురు వెనుక పైపున

నల్గురు ఎక్సయిజ్ కానిస్టేబుల్స్ కూసున్నారు. అంతపూటుగా తాగి ఉన్నారు. ఆ జీబు మొత్తం చమటతోని బస్స బస్స కాలుస్తున్న సిగిరెట్టు బీడి పొగలతోని సారా కంపుతోని చిరు చిరులాడు తుంది.

జీబు కదిలింది రోడ్డుమీద అడ్డంగా పరిగెడుతు. ఆలా కొద్దిసేపు ప్రియాణం చేసిన తర్వాత జీబు రోడ్డుదిగి బండ్ల బాటంట తుప్పలు బోదులు దాటుకుంటు చివరికో పల్లెను చేరుకుంది. అప్పటికింకా చీకటితొల్గిపోలేదు. తూర్పుకు వంగినయి అప్పుడె విచ్చుకుంటున్న సందెవెల్లులు ఊరుకో అస్పష్టమైన ఆకారాన్నిస్తున్నాయి, ఊర్లోకి చేరుకునే మూలమలుపుకాడ పెద్ద మర్రిచెట్టుంది. ఆ మర్రిచెట్టు నీడల జీబు ఆపిండ్లు. జీబు లైట్ల వెలుగులో హిప్పీజుట్టు పెంచుకున్న దౌడలు పీక్కబోయిన అతను మా జీబుకోసమే చూస్తున్నట్టుంది. జీబుకాడికొచ్చి 'ఇంత ఆలస్యం అయిందేంసార్ మీరు వస్తారో రారోనని చూస్తున్నా'.

"వస్తాం అన్న తర్వాత ఆరునూరైనా రావటం రావటమే" అన్నాడు మా జీబులో ముందుకూసున్న సంజీవరావు అతనే ఇటువంటి రైదింగులకు నాయకత్వం వహించేది' అతనిపక్కన కూచున్న ప్రకాశ్ 'ఇంతకు ఇక్కడ దొంగసారా కాసె ఇండ్లెన్ని ఉన్నాయి. ఎక్కడెక్కడున్నాయో అన్ని వివరాలు తెల్సా"

ఆ చీకట్లో ఒకసారి పైరు పంచరైనట్టు కిసుక్కున నవ్వీండు సంజీవరావు, ఇంకా నవ్వుతూనే 'గామాత్రం తెల్సుకోకుండా వస్తామటయ్యా.'

'అంతా నాకెరుకెసార్ మీరు బయలుదేరటమే ఆలస్యం' అన్నడా యువకుడు అతి వినయంగా.

'వెనక్కిపోయి జీబెక్కు' సంజీవరావు ఆ యువకున్ని ఉద్దేశించి అన్నాడు. ఆ యువకుడు జీబు వెనక్కి కదిలిండు 'మొత్తానికైతె నీ చేతులు అన్ని పైసలున్నాయి ఇంతకీ ఊర్రాదెపరు' ప్రకాశ్.

"నాల్గు డబ్బులు మనయి కావనుకుంటె కొండమీద కోతినైనా దింపవచ్చు దందా నడిపెకాడ పైసలకు ఎన్కముందు చూడద్దు పని అయేదెట్లా అని ఆలోచించాలి" సంజీవరావు.

జీబు మళ్ళీ బయలుదేరింది. ఊళ్ళోకొచ్చిన తర్వాత రెండు పానాదులు వచ్చినయి. ఎటుపోవాలో అర్థంగాక డ్రైవర్ వెనక్కి చూసిండు. 'లెఫ్ట్‌పోనియ్' అన్నాడు ఇందాకటి యువకుడే. జీబు కాపువాడ కొచ్చింది.' అగ్గో నాల్గో నెంబరు ఇల్లె' అన్నాడా యువకుడు జీబు దిగకుండానె.

'దిగు' సంజీవరావు.

'అమ్మో మీరివ్వాల మీ పని చూస్కోని పోతరు. తెల్లారిలెస్తె ఈ ఊర్ల బతికెటోన్ని వాళ్ళ కంటపడ్తె బతకనిస్తరా' అన్నాడు భయంగా.

"తూ పిరిగిగొడ్డు మేంలేమురా నీమీద ఈగవాలనిస్తాంరా ఎవడన్నా ఎదురు తిరిగితె లంజకొడుకుల చెమ్డాలు ఊడతియ్యంరా" ప్రకాశ్.

ఆ యువకుడు జీబు దిగిండు.

అప్పటికి సందెల్గులొచ్చినయి. ఊరు నిద్దురమత్తు ఇంకా వీడిపోలేదు గా యాలప్పుడు మా రేడింగ్ మొదలయింది. ఊరు ఊరంత గెబ్బరపాలయింది. కుండలు పగిలినయి. అందినోల్లను అమురకవచ్చి చావబాదిండ్లు మొదట కాపువాడ ఆ తర్వాత మాలవాడలనొచ్చి అక్కడ అదె జర్గింది. ఈ అటావిడంత మూడుగంటలు సాగింది. నాల్గు కుండలు, రెండు క్యాన్లు ఒక మోటారు టైర్ల స్టాక్‌జేసిన సారా దొరికింది. ఉత్త తోల్లను వదిలిపెట్టి చివరికి నల్గురు మొగోల్లను, ఓ ముసల్దాన్ని, మరో పడుచమ్మాయిని తీసుకొని వచ్చిండ్లు. అమ్మాయి ఇంట్లో చిన్న ప్లాస్టిక్‌డబ్బాలో నాటుసారా దొరికింది. ఇంట్లో తల్లి దండ్రులు లేరు. వాళ్ళ వాళ్ళెవరో చనిపోతె ఊరెల్లారని తెల్సింది.

వాళ్ళందర్నీ తీసుకొని అడ్డకాడికొచ్చినం. మా గోదాంలోని లాకపు రూంలో వేసి ఇర్గగొట్టిండ్లు. వంతులవారిగా గుద్దిండ్లు. "నీబాంచెను ఇంకెప్పుడు గీ తప్పుడు పని చెయ్యం- నీ పియ్యి తింట, నీ కాల్మొక్కుత" అంటు దీనంగా అరిచెటోల్లు. కాని వాళ్ళ మాటలెవరు వినెటోల్లెకాదు. 'లంజకొడుకుల్నందర్ని పెట్రోలుపోసి తగల బెట్టినా పాపం లేదు' అంటు మా సార్కిపో మేనేజరు హన్మంతరావు కోపాని కొచ్చెటోడు,

అందర్నీ కొట్టినా గా పడుసమ్మాయి మీద చెయ్యెవరు వేయలేదు ఆ అమ్మా యిని తీసుకొచ్చినకాంచి ఒకటె ఏడ్పు. కాని అదేమి పట్టించుకోకుండా పిటపిటలాడు తున్న ఆ అమ్మాయి రొమ్ములకేసి, పిర్రలకేసి ఆశగా చూసెటోల్లు.

ఆ మరునాడు సాయంకాలము ఆ అమ్మాయిని మా మేనేజరు హన్మంతరావు దొరుండె విశ్రాంతి గదిలకు గుంజుకపోయిండ్లు. లోన అరుపులు పెడబొబ్బలు అంత కంతకు క్షీణించినయి. సినిమాల్లో అయితె అటువంటి సీన్లల్ల గిలాసలు పగిలిపోయినట్లో, లేడిమీద పులిదుమికినట్లో చూయిస్తరు. సరిగ్గా గట్లనె మూసున్న మా మేనేజరు గదిముందు కాసాయ బట్టలేసుకొని నొసట తెల్లబొట్టు పెట్టుకొని దొంగనవ్వు నవ్వుతున్న ఎంటిగాని బొమ్మ కన్పించింది. మా దొర తెలుగుదేశంలో చేరినకాన్నుంచి గా బొమ్మ గక్కడ వేళ్ళాడుతుంది.

కాసేపయిన తర్వాత సంతృప్తిగా నవ్వుతు మా మేనేజరు దొర బయిటికొచ్చిండు "ఓరె సంజీవా నువ్వుకూడా ఓ ఛాన్సు చూస్కోపోరా షిఐబండి...." అంటు అదే దొంగనవ్వు నవ్వుకుంటు వెళ్లిపోయిండు దొర.

సంజీవడు అనే సంజీవరావు మేనేజరు గదిలోకెల్లి తలుపు మూసుకున్నడు. ఆ దొంగ లంజకొడుకుల గొంతులు కసుక్కున కొరికేయాలనిపించే పిచ్చి కోపమొచ్చి అక్కడీసుండి ఎవరికి చెప్పకుండా ఇంటికొచ్చి పిచ్చిలేసినోనితీర్గ ఊరంత తిర్గిన.

రెండురోజుల తర్వాత పట్టుకొచ్చినోల్లందరిమీద ఎక్సయిజ్ చట్టముప్రకారము దొంగసారా కాసినదాని కింద కేసు బుక్ చేసిండ్లు. ఆ అమ్మాయిని మాత్రం వాళ్ల తల్లిదండ్రులు బతిలాడి బామాడి 450 రూపాయలు జుల్మానా చెల్లించి విడిపించుకొని పోయిండ్లు.

* * * * *

గిదంతా జర్గుతున్నా ఎవరేం పట్టించుకున్నట్టులేదు. సారా ధర సౌకు 3-20 నుండి 4 రూపాయలు పెరిగింది. అయినా తాగెటోల్లు తాగుతనే ఉన్నరు. దొడలు తీపులు పెట్టినోడు, వొళ్లు నొప్పులు పెట్టినోడు, బాధలుపడెటోడు, బతుకులెల్లనోళ్లు, అదే లేబరోల్లు, కూలోల్లు, మట్టికొట్టుకపోయిన మొఖాలు వణికె చేతులతో వచ్చి తాగుతూనే ఉన్నారు. వాళ్ళను చూస్తుంటె మానాన్న గుర్తుకొచ్చెటోడు. వాళ్ళపెళ్లాం పిల్లల ఏడ్పులేవో వినిపించేవి. నా మనసంత కుతకుతలాడేది.

అగ్గో గటువంటి సమయంల ఓ బందురోజునాడు మా వాడలున్న జనమంత పోగయిండ్లు. ఏంటో తెల్సుకుంటామని అక్కడికి పోయిన. పాతిక సంవత్సరాల వయస్సుండే యువకుడొకడు ఏదో వాళ్ళకు చెపుతున్నడు.

"....మనల్ని తాగుబోతులను చేసి పిచ్చి తాగుబోతులుగా ఉన్మాదులుగా చేసి సంసారాలను నాశనం చేస్తున్నారు. మన రెక్కల కష్టం, మన రక్తం మనకు చెందకుండా చేయటమే కాదు మన బుర్రలు మనవి కాకుండా చేస్తున్నారు. ఆ తాగుడు మైకంలో పడ్డ మన సోదరులు పెండ్లాం పిల్లలు అన్నమో రామచంద్రా అంటూ ఆకలి చావులు చస్తున్నారు. కాయకష్టం చేసెటోడు తమ బాధలను కాసేపు మరిచిపోవటము కోసము మహమ్మారిలాంటి సారాకొట్టుకు పోతాండు. అలా మొదలుపెట్టినవాడు చివరికి అది లేకుండా బతకలేని స్థితికొస్తున్నాడు. ఎన్నో వేల సంసారాలు ఈ సారా చేయబట్టి నాశనమౌతున్నాయి. ఎందరో పిల్లలు అనాథలవుతున్నారు."

"అవుబిడ్డా ఉన్నమాట చెప్పినవు" మొఖం ముడుతలు పడ్డ స్త్రీ మధ్యలో కల్గజేసుకొంది.

"తాగుడుకు బానిసలైన జనం బలహీనతను పెంచి పోషించటమేకాదు. ఆ బలహీనత ఆధారంగా చేసుకొని డబ్బు సంపాదించేందుకే దోపిడీదారులైన కంట్రాక్టర్లు వాళ్ళకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అందుకే ఈ దోపిడీకి వ్యతిరేకంగా మనం పోరాటం చెయ్యాలి. పెంచిన సారా రేటు తగ్గించాలని మనమంత ఒక్క కట్టు పోరాడాలి". జనంలోకి చూసాడతను.

"ఏమోనబ్బా తాగుబోతోల్లు తాగకుంటా ఆగుతారా నాకు అనుమానమే" మందిలో నుండి ఎవరో గొణిగినట్టున్నరు. "ఎందుకాగరు, ఆగనోని నోట్లెంత ఉచ్చపోత్త తూ, షరాలులేని బతుకు" తలంతా చెదిరిపోయిన ఆమె కోపంతో అరిచింది.

కాసేపు అల్లరల్లరిగా మాట్లాడుకున్నరు. ఎవరిమాట ఎవరికి వినబడలేదు.

చివరగా అందరు బందంటె బందన్నరు అట్లా సారా పోరు మొదలయింది.

అదిగో ఆ సమయంలనె మావాడలోఉండే చలమయ్య సారుకూడా ఓ మీటింగ్ పెట్టిండు. 'సారాదర తగ్గేంత వరకు పోరాటం ఆపద్దు' అంటు చాల చాల చెప్పిండు. ఆయన మాటకు మా వాడల కొంత పలుకుబడి ఉంది. ఆయనకూడా పోరాటంలో కల్సి వచ్చేసరికి అందరికి సంతోషమైంది.

సారా కొట్లన్నిమూతలు పడ్డయి. సారా కొట్ల ముందు పోలీసులు తప్ప జనం ఎవరు పోవటములేదు. అటువంటి సమయంలోనె నేను నా సారా పని మానుకున్నా. నాకెందుకో తలమీద బరువు దించేసినట్టయింది. ఇన్నిరోజులకు నేను మంచిపని చేసే నన్న సంతృప్తి మిగిలింది. నేను సారా పోరాటం చేసెటోల్లతోనే కల్సిపోయిన. దొంగసాటుగా సారా ఎట్లా అమ్ముతారో నాకు అనుభవముంది. సారా డిపోలలో కాకుండా ఇండ్లల్లో పెట్టి చాటుమాటుగా అమ్ముతరు. అగో అటువంటివికూడా బంద్ చేయాలనుకుని అట్లాగే సేసినం.

"బీకులబస్తీలో మూడవనెంబర్ డిపో తెరిచి సారా అమ్ముతండ్లు" పకీరయ్య ఎగబోసుకుంటు వచ్చి చెప్పిండు.

"అన్ని దుకాన్లు బంద్ పెట్టియ్యాలె"

"అక్కడ పోలీసులున్నరు"

"ఉంటె ఉండనియ్యి చంపుతారా చంపనియి"

లంజాకొడుకులను సారా అమ్మకుంట చెయ్యాలి

'పద అంటె పద అనుకున్నరు.

నిముషాలమీద వందలమంది పోగయి మూడవ నెంబర్ సారా డిపో కేసి కది లిండ్లు. అంతమంది కలిసిపోతాంటే ఏం జరిగిందో చూద్దాం అని వచ్చినోల్లు, ఇంకొంతమంది కలిసి మొత్తానికైతే ఐదారువందల మంది పోగయిండ్లు. అప్పటికే సారాడిపోలో ఉన్న నల్గురు పోలీసులు అంత మందిని చూసేసరికి బెదిరిపోయిండ్లు. వాళ్ళేమి ప్రతిఘటించలేదు. గిదగిద ముందుకొచ్చినోడు పోయి కౌంటర్లో కూసున్న తనితో వాదానికి దిగిండు. మరెవ్వరో 'చూత్తండ్లేందిరా వాన్నిట్టు గుంజుండ్లె' అని అరిచిండు. మరొకడెవడో సారాజాడీలను లేపి నేలమీద విసిరిండు. పది నిమిషాల్లో ఆ కొట్లో ఏం మిగలలేదు. ముందేమి జరుగుతుందో ఎనక ఉన్నవారికి తెలియనేలేదు.

అంతలకె అదనపు పోలీసులు గాలిలో కాల్పులు జరుపుకుంటూ వచ్చిండ్లు. దాంతో జనం తలోదిక్కున పారిపోయిండ్లు. ఏదో కొద్దిమందిని దొరకబుచ్చుకొని పోలీసులు పోయిండ్లు.

అది జరిగిన నాల్గు రోజులదాకా పోలీసులు ఇండ్లల్లకు సొచ్చి అందినోల్లల్ల పట్టుకపోయిండ్లు. కొద్దిమంది దెంకపోయిండ్లు. అటువంటి సమయాలనే 'సారా ధర తగ్గించిండ్లట' అన్న పుకార్లు పుట్టినయి. గా పుకార్లు నిజమేనన్నట్టుగా మా వాడలో చలమయ్యసార్ ఓ మీటింగ్ పెట్టిండు "మన పోరాటం విజయవంత మైంది. సారా ధర తగ్గించేందుకు సారా కంట్రాక్టర్లు ఒప్పుకున్నరు ఒప్పందంకూడ కుదిరింది. మనం పోరాటాన్ని విరమించాలి"

అక్కడ పోగయిన జనం ఒక్క క్షణం ఆశ్చర్యంలో మునిగిపోయిండ్లు.

ఓ బొక్కినోరు ముసలోడు తొస్సు తొస్సుమంటు 'ఎంత తగ్గించిండ్లట బాంచెను' అడిగిండు. "లీటరుకు రూపాయి తగ్గిస్తామన్నరు" అందరివైపోసారి పరీక్షగా చూసి "అంటే సౌకు పది పైసలు తగ్గిస్తామన్నరు"

"అవుబాంచెను గొప్ప విజయం సాధించుకొచ్చిండ్లు" ఇందాకటి ముసలోడే మల్లి అసహనంగా గునిగిండు.

చలమయ్యసారు అదేం పట్టించుకోకుండా మల్లి చెప్పటం మొదలుపెట్టిండు. 'మనముందున్న పరిస్థితులు ఎంత విషమంగా ఉన్నాయో ఎంత తీవ్రరూపం దాల్చినయో ఒక్కసారి అర్థంచేసుకోండ్లే. మొన్న మూడవనెంబరు సారాడిపోలో కాల్పులు జరిగినయి. అదృష్టవశాత్తు ఎవరికి గాయాలు తగలలేదు. అదే తాకేవుంటే పరిస్థితులు ఎట్లా ఉండేటివి? పోలీసుల గాలింపులు ఎక్కువైనయి ఇండ్లల్ల ఎవరుండకుండా పారిపోతున్నరు. ఇలా ఎంతకాలమని పారిపోదాం? రోజురోజుకు పరిస్థితులింకా తీవ్రరూపం దాల్చుతుంటే ఎవరు నిల్చుంటరు? దొరికినోల్లందర్ని అరెస్టులు చేస్తాండ్లు. ఇలా ఎంతకాలం కొనసాగిస్తాం. ఇప్పటికి మనం సాధించింది అల్పమైన విషయం ఏంకాదు. మనం మన ఐక్యతను ప్రదర్శించినం. ఇంకా ముందు ముందు మన మెన్నో పోరాటాలు చెయ్యాల్సి ఉంది. అందుకె ఎనకముందుకు ఆలోచించే ఈపని చేయటం జర్గింది. అతను ఇంకా ఏదో చెప్పటానికి నోరిప్పిండు. కాని అంతలోనే "చాల్లేవయ్యా సెప్పొచ్చినవు పోలీసోల్ల లాటీలుసూడంగనే పిచ్చలుడప్పులుకొట్టినయా? గటువంటోడివి గీ లొల్లిలకెందుకొచ్చినవు. అదెవాయె వచ్చినవె అనుకో నిన్నెవడు అందరి తరపున వకాల్తా తీసుకొని ఒప్పందం చేసుకోమన్నడు. ఏదో పెద్ద సాధి చి

కొచ్చినట్లు చెప్పుకొస్తానవు". మొఖమంత జేవురించుకస్తూతాంటే పొడుగుమొఖం కార్మికుడొకడు లేచి అడిగిండు.

'ఇది నేను ఒకన్నె చేసిందికాదు మనోల్లను విచారించె చేసిన' అదిగో పెద్ద మనిషి బాలయ్యను. గా రాయమల్లుని అడుగుండ్లి అందర్ని విచారించినోల్లేదో తెలుస్తది" అంటు వాళ్ళకేసి చెయ్యిపెట్టి సూయించిండు చలమయ్యసారు.

'నీకు విచారం చేయటానికి గీ తాగుబోతోల్లె దొరికిండ్లా" "వాని పెండ్లాం ఉచ్చుతాగకుంటె విద్రి పడ్తలేదేమో తూ నీ తాగుబోతు పుట్టకలనా........" అంటు కాండ్రించిండొకడు.

"ఓరె ఐలిగా తొందరపడ్తె అయితాదిరా ఆ సాటు చెప్పిన దాంట్లె న్యాయముందిబిడ్డా. నిదానంగా ఆలోచించాలి మెల్లమెల్లగా పోవాలె కాని ఒక్కసారే పరుగుపెడ్తానంటే అయితాదిరా" ముసలి బాలయ్య కూసున్నకాడి నుండి బదులు పలికిండు.

"తొందరపడి నిర్ణయాలు చేసిండెవరో తెలుస్తనే ఉన్నది లీటరుకు ఎనిమిది రూపాయలు పెర్గినకాడ ఒక్కరూపాయి తగ్గిత్తనమంటె సంకలు కొట్టుకుంటావచ్చి ఏదో పెద్ద పురుషత్తం చేసినట్టు చెప్పుకొచ్చిండ్లు చెప్పటానికి సిగ్గులేకున్నా వినటానికన్నా ఉండద్దు. ఇంకేమున్నది ఇక్కడలేండ్లి, లొల్లి ఆగేదిలేదు" బుజంమీది ఎర్రికండువాను దులుపుకుంటు చిటపటలాడుతు మందినుండి లేచిపోయిండతను.

ఆతర్వాత ఒక్కొక్కరే లేచిపోయిండ్లు చివరగా చలమయ్యసారు ఆయన చుట్టు మరో నల్గురు మిగిలిపోయిండ్లు. వెళ్ళిపోయినోళ్ళ దిక్కుచూస్తు "తొండ ఉర్కి ఎన్గులదాకన్నట్లు ఎగిరిపడ్తాండ్లు పదవియ్య వాళ్ళ మూతిపండ్లె ఇర్గపడ్తరు చెప్పంగ విననోన్ని చెడంగ చూడాలన్నరు. ఇటువంటోల్లను మస్తుగ చూసిన. ఇగో నా నెత్తిమీద వెంటుర్కలున్నంత మందిని చూసిన" ఇంకా ఏదో చెప్తునేఉన్నాడు.

అదేరోజు సాయంకాలము జనం మల్లి జమయిండ్లు. సారా పోరు ఆపాలనేటోల్లకు కాదు కొనసాగాలనేటోల్లకు వాగ్వివాదం జర్గింది. ముఖ్యంగా స్త్రీలు లొల్లిని 'ఆపనే ఆపద్దు' అన్నారు. బాగా కోపానికొచ్చిన స్త్రీ ఒకతి లొడలొడ

వాగుతుంది. "....సదువు చెప్పు మహారాజా అంటే దుడ్డె బర్రె నాది అన్నాడట ఎనకటికి ఎవడో, గాయన్నెవరు ఇండ్ల ఏలుబెట్టమన్నరు, ఏలుబెట్టినోడు ఉత్తగ ఊరుకోక అందరి తరఫున పకల్తా ఎవరు పుచ్చుకొమ్మన్నరు. కూలిచేసిన కొత్తంతా కుక్కలు తాగినట్టు తాగబట్టిరి, పోరగాండ్లేమి తినాలి.... సారా ఇంట్ల మన్నుబొయ్య. పావలాపర్క తగ్గుతె ఏమొస్తది అసలు సారా అమ్మకుంటనే చెయ్యాలి" ఆమె గొంతు అంతకంతకు జీరబోయింది.

ఒక్క క్షణం నిశ్శబ్దం ఆవరించింది. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఓ మనిషి లతను మందిలకెల్లి ముందుకొచ్చిండు. "అందరం కల్సి ఒకతాటి ఉండాలంటిమి లొల్లి ముదిరిపాయె. జన్నకిడ్చిన ఆంబోతోల్లె పోలీసులు ఊరిమీదపడి కనబడ్డోల్లను పట్టుకబోయిరి. అగో గట్ల పట్టుకపోయినోల్లను కూడా విడిపించాలని లొల్లి చెయ్యాలె"

"అవునవును" కొందరు ప్రయత్నంగా అరిచిండ్లు.

అగో అటువంటి సమయం జనాన్ని పావుకంటు మళ్ళీ అదే బక్కపల్చటి యువకుడొచ్చిండు. అందరు ఒక్కక్షణం నిశ్శబ్దం అయ్యిండ్లు. అతను చెప్పటం మొదలుపెట్టిండు "కామ్రేడ్స్ మనం ఐక్యంగా సారా రేటు తగ్గాలనిచేస్తున్న మన పోరాటాన్ని అరెస్టులు, చిత్రహింసలద్వారా అణచలేమని గుర్తించిన ప్రభుత్వం మనదాంట్లో మనకే విరోధం పెట్టి మనకంట్లో మన వేలే పొడవటానికి మన ఐక్యత దెబ్బతీయటానికి ఓ కొత్తఎత్తు ఎత్తింది. దాంట్లో భాగంగానే మనవాళ్లలో కొందరిని వేరుచేసి సారాతగ్గిస్తాణం అంటు మాయమాటలు చెప్పి మోసంచేయాలని చూస్తున్నది ఒప్పందాలు అయినవి అంటాండ్లు. ఏమిటా ఒప్పందము లీటరుకు ఎనిమిది రూపాయలు పెంచటము వాళ్ళ ఇష్టమే పెంచినదాంట్లో బిచ్చం వేసినట్టు ఒక రూపాయి తగ్గిస్తానం అని వాళ్ళంటె మనోళ్ళు సంకలు కొడతండ్లు ఇంతకుముందు ఒక తల్లి ఎంతో ఆవేదనతో పావలాపర్కా తగ్గిస్తే ఏమొస్తది మొత్తం సారాఅమ్మకుంట చేయాలన్నది. కాని ఈ దోపిడీ ప్రభుత్వం అందుకు సిద్ధంగాలేదు సరికదా ఏటా దికిఏడాది మరింత లాభాలు గుంజేందుకు ప్రయత్నిస్తుంది. గత సంవత్సరములోని ఎక్సైజ్ ఆదాయం 270కోట్ల నుండి 330 కోట్లకుపెంచింది. సారా కంట్రాక్టర్లు రోజురోజుకు లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ఇవన్నీ

ఎక్కడనుంచి రావాలె? తాగేటోడే చెల్లించాలి తాళ్ళపన్ను అన్నట్టు ఇదిగో ఈ సారా తాగే కూలీనాలీజనుండే పిండుకోవాలి ఆ డబ్బంతా. అందుకే వాళ్ళు ఎన్నిఎత్తులు వేసినా అంతిమంగా మనల్ని దోపిడీ చేయటానికే. ఈ దోపిడి ప్రభుత్వాన్ని కూల్చేంతవరకు మనకు ఈ కష్టాలు తప్పవు. అందుకు మనమంత...." అంతలకే పోలీసులొచ్చిండ్లని కలకలం బయలుదేరింది. నాలుగు పానాదుల కమ్ముకున్న పోలీసులు తుపాకులు బారుచేస్తు ముందుకు కదిలిండ్లు. జనానికి ఎటు కదలటానికి వీలులేకుండా అయింది. అగో గా బక్కపల్చని యువకున్ని కంటికి నజరువచ్చిన మరో ఆర్గురిని పట్టుకొన్నరు. పోలీసులతోపాటే వచ్చిన సంజీవరావు మందిలో నన్ను కనిపెట్టి పోలీసులకు సైగచేసిండు. ఇద్దరు తుపాకులు పట్టుకున్న పోలీసులు వచ్చి పెనుగులాడుతుండగానే ఎత్తుకెళ్ళి వ్యానులో ఎక్కేసిండ్లు. వ్యాను కదిలింది.

అలా అరెస్టుచేసి తీసుకపోయిన మమ్మల్నందరిని నాలుగురోజులదాక లాకప్పు లేసి పెయ్యిమీగ పెద్ద కొత్త సందులేకుండా కొట్టిండ్లు. మోకాళ్ళ సందుల రోకల్లు పెట్టి కడుపుల పేగులు తెగిరాంగ కీట్యాడగొట్టిండ్లు. ఆ నాల్గురోజులు తీరొక్కబాధ పెట్టిండ్లు. నా జన్మలో నేనెప్పుడు అలా దెబ్బలు తిన్లేదు. దెబ్బలకు మూడురోజులు వొళ్ళంత నొప్పులతో నిప్పులు చెరిగేలా జ్వరమొచ్చింది. గోదావరిఖని డీఎస్పీ, సర్కిల్స్పె, సబ్ఇన్స్పెక్టర్లు కూర్చిలల్లో కూచుని ఒక్కొక్కరే యాష్టవచ్చేదాక వంతుల వారిగా కొట్టెటోళ్ళు. ఆరోజు అరెస్టు చేసినవాళ్ళలో మమ్మల్నందరిని కొట్టిందొక ఎత్తు. నాతోపాటు అరెస్టయిన ఆయువకుడ్ని కొట్టింది ఒకఎత్తు. నేను లాకప్పులో ఉన్న నాల్గు రోజులలో పన్నెండుసార్లు స్పృహ కోల్పోయిండు. ఇంటరాగేషన్ కోసం అతన్ని కదల్చాలంటే పోలీసులు చేతులను డోలీలు పెట్టి మోసుక పోయేవారు. మళ్ళ ఏదో అడిగేటోళ్లు. మళ్ళ స్పృహకోల్పోయిన తర్వాత తిర్గి లాకపురూమ్లో పడేసె వారు. అతన్ని చూసెసరికి నా కడుపు తరుక్కుపోయేది. వొళ్ళంత కోపంతో కుత కుతలాడేది.

ఐదోరోజు ఆ యువకున్ని మినహా మమ్మల్నందర్ని కోర్టుకు తీసుకపోయిండ్లు.

* * *

అదేదో అర్థం కాకుండా కోర్టు జవాను పిల్చిండు. 'పదండి పదండి' అంటు మాకు ఎస్కార్టుగా వచ్చిన పోలీసులు లాటీలు ఆడించుకుంటు నెట్టుకుంటు కోర్టు హాల్లోకి తోసుకుపోయిండ్లు.

కోర్టు హాల్లో జడ్జి సీట్ల కూచున్న నల్లకోటాయెన ఎర్రెటి బట్టతల మెరుస్తుంటె తెల్లకళ్ళద్దాల నుండీ మావైపు చూసిండు. ఆయన నెత్తిమీద తెల్లకోక కప్పుకున్న గాంధి ఒకచేత కర్రపట్టుకొని మరోచేత లోకాన్ని దీవిస్తు ఎర్రినవ్వు నవ్వతాండు. గా జడ్జిముందు కూసున్న గుమస్తా ఏవో కాగితాలు తీసి ఇచ్చిండు. ఆ గుమస్తాకు ఈవల గుండ్రెటి టేబిల్‌చుట్టు నల్లకోటు కప్పుకున్న వకీలుసాబ్‌లు కూసున్నరు. గా వాళ్ళవెనుక పోలీసులు కూసున్నరు. వాళ్ళకు ఈవల గోడకానుకొని ఉన్న రెండు వరసల బెంచీలల్ల జనం కూసున్నరు గా జనంల చలమయ్యసారున్నడు. పోలీసోల్ల పక్క హనుమంతరావు, సంజీవరావు ఇంకా కొంతమంది సారా మాములాల్ల తిర్గటోల్లున్నరు. మేము ఏడ్గురం బోనులో నిల్చున్నము. మా పక్కన పారిపోకుండా పోలీసులు నిల్చున్నరు.

గవర్నమెంట్ వకీలుసాబొచ్చి జడ్జిగారితోని ఏదో ఇంగ్లీసుల చెప్పిండు, ఆయన మావైపు తిర్గి సన్నటి పెదాలవిప్పి "దొంగసారా తయారు చేస్తాండ్లనీ గవర్నమెంటు లైసన్సు ఉన్న సారా దుకాణంమీద దాడిచేసి అంతా ధ్వంసం చేసి లూటీ చేసారని, జనాన్ని రెచ్చగొట్టి అరాచకం సృష్టించారని మీమీద కేసు మోపబడింది. ఇది మీరు ఒప్పుకుంటున్నారా"

మా అందట్లోకి పెద్ద వయసున్న రాజీరు రెండు చేతులు జోడించి

"అంతా అబద్దం బాంచెను, ధర్మప్రభువులు తమరె న్యాయం చెప్పెటోల్లు ఇగ్గో గీ ఈపు సూడండి ఈ పోలీసోల్లు ఎట్ల గొడ్డును బాదినట్లు సావబాదిండ్లో" అంటు పెయ్యిమీద అంగి ఊడబీకిండు. పెయ్యంత కమిలిన గాయాలున్నాయి. మోకాలుమీది బట్ట ఎత్తి సూపించిండు. కండ్లపొంటి నీరుకారంగా దుఃఖంతో నోరు పూడుకపోయింది. "ఏం తప్పు చేసినమని బాంచెను మమ్మల్ని ఈతీర్గ కొట్టిండ్లు అగో గక్కడున్న గా పోలీసాయన్ను అడుగుండ్లి కూలీనాలీ చేసుకునే బాంచెగాండ్లము వొల్లు తీపులు పెడ్తాంటె ఓ సపు వేసుకుంటె మత్తుగ నిద్రపడ్తదని గా సారా కొట్లకు పోతం. గా మాత్రం సుఖం లేకుండా సారా ధర పెంచిండ్లు. ఇగ అట్లయితె బతకలేం, సారాధర తగ్గితేగాని సారాతాగమని మేమంతా అనుకున్నం అంతెబాంచెను అగో అట్ల అనుకొని సారాతాగుడు బందుచేసిన కాన్నుంచి మా ఇండ్లల్లకు పోలీసులొచ్చి పిల్లజెల్ల అనకుంట పట్టుకొచ్చి ఇగో గీతీర్గ కొట్టి మీ ముందు తీసుకొచ్చిండ్లు.

అంతకంటే మేం ఏ నేరము చేయలేదు బాంచెను" ఆ తర్వాత దుఃఖముతోటి అతని మాట పెగలలేదు.

నల్లకోటేసుకున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ కళ్ళద్దాలు సవరించుకుంటూ ముందు కొచ్చి "కోర్టులో అలా ఏడ్వకూడదు అడిగిందానికి సూటిగా చెప్పాలి. మీరు సారా కాసింది నిజమా కాదా? ఒక మాటలో చెప్పు...." అంటు నెమ్మదిగా అసలు విషయం రాబట్టేందుకు ప్రయత్నించిండు.

"అయ్యా మావోడు ఏదో వాని బాదంతా చెప్పుకొచ్చిండు. గీ సారేందో దొంగసారా కాసిండ్లా లేదో సూటిగా చెప్పంటాడు. గా పోలీసోల్లు లంజకొడుకుల్లారా సారా దుకాణంమీద దౌర్జన్యం చేస్తారా? అని మా ఈపులంత ఇత్తులుడీపి చింతపండు తీర్గ చేసిండ్లు. అయ్యా అది నిజమో కాదో తెల్సుకోవటానికి మావోడు అంగి ఇడ్సి వీపుచూయించిండు. ఆయనొక్కని ఈపె కాదుదొరా మా అందరి ఈపులు చూడండి పచ్చిపుండు తీర్గ ఎట్లయినయో, ఎవలు దౌర్జన్యం చేసిండ్లో తెలుస్తది." తాటిమట్ట తీర్గవంగి ఎంకులు ఆ తర్వాత ఏం మాట్లాడాలో తెలియక నోరు మూసుకున్నడు.

రాయలింగం అందుకుని 'అయ్యా! నేను చానా ఏండ్లకాన్నుంచి సారా తాగుతానా మొన్న గీ లొల్లి అయినకాన్నుంచి తాగద్దు అనుకొని ఇగ సారాకొట్టు ముఖం సూల్లె. అగో అది కటరి పెట్టుకొని, అదిగో గా పోలీసాయన దగ్గరున్న మాములా దారు నన్ను పట్టించిండు." అంటు రాయలింగు ఇంకా ఏదో చెప్పబోయిండు కాని అతని మాటకు అడ్డుపోయి నమ్మయ్యా "గదంతా ఎందుకు కాని నన్ను చెప్పనియ్యి" అంటు ముందుకొచ్చిండు.

జడ్జి గుర్రుగా చూస్తు "అతను చెప్పనియ్యి" అన్నాడు.

నమ్మయ్య వెనక్కి తగ్గిండు. కాని రాయలింగు "ఇక ఏం చెప్పేదిలేదు" అంటు చేతులు ఎత్తిపట్టి జోడిస్తూ దండంపెడ్తూ వెనక్కి జర్గిండు.

జడ్జి ఇక ఇప్పుడు చెప్పమన్నట్టుగా నిర్లక్ష్యంగా చూసిండు.

నమ్మయ్య కాస్త ముందుకు జర్గి, అందరి వైపోసారి చూసి, జడ్జి వైపు తిర్గి చెప్పటం మొదలుపెట్టిండు.

"మేము దొంగసారా కాసిన మంటాండ్లు అది మేం చేయలేదంటాపం. కాని అచ్చంగా దొంగసారా కాసెటోళ్ళు హాయిగున్నరు. వాళ్లు అడిగో గా పోలీసోళ్ల పక్కన కూచొని చోద్యం చూస్తున్నరు" అంటు ఏల్లెత్తి కంటాక్టర్లవైపు చూయించి మళ్ళీ మొదలుపెట్టింది.

"ఉత్త పుణ్యానికి మేం బోన్ల ఉన్నం. అగ్గో గా కొత్త మామూలాదార్లు. మాములా తీసుకోకముందు మా ఇలాకాలో సారా పాట పన్నెండు లక్షలుండె దాన్ని ఈ సంవత్సరం, పద్దెనిమిది లక్షలకు పెంచి పాడిండ్లు. దాంతో చిన్న చాపలవంటి సారా కంటాక్టర్లు కొట్టుకపోయిండ్లు సరే అంత పాట పాడిన కంటాక్టరుకు గవర్నమెంటు సప్లయిచేసేకోటా ఎంతంటె నెలకు 5000 లీటర్లు, రు. 6-25 చొప్పున సప్లయి చేస్తది. ఇప్పుడున్న లెక్క పకారమే సారా దర లీటరుకు రు. 40/- చొప్పున అమ్మినా కంటాక్టర్లకు లాభాలు అనుకున్నంతరావు. మరైతె కంట్రాక్టర్లు తాగెటోల్లకేమన్నా సేపచేసేందుకు కంకణం కట్టుకున్నారా?" అంటు పిల్లలకు పాటం చెపుతున్న పంతులుతీర్గ ఒక్కసారి కూచున్న జనంపై పుచూసి మళ్ళి కొనసాగించింది. అందరు వింతగా నిశబ్దంగానె వింటున్నారు.

"ఏమిటి నువు మాట్లాడేది?" జడ్జి అన్నాడు.

"నిజమేసాబ్, మీకుకాక ఇంకెవరికి చెప్పాలె? గవర్నమెంటు సప్లయిచేసె 5000 లీటర్లు మా గోదావరిఖనిలోనె ఒక్కవారం రాదు. ఇక మిగతా మూడు వారాలు ఏం అమ్ముతడు. మా దగ్గరున్న 22 సారా కొట్టుల అన్ని కల్పి నెలకు 40.000 లీటర్ల సారా అమ్ముతరు. గవర్నమెంటు నెల కోటా పకారం సప్లయిచేసే 5000 లీటర్లుపోతే, మిగతా 35,000 లీటర్లు ఎక్కడినుంచి వస్తయో ఆలోచించుండ్లి? నెలకు నలుబయివేల లీటర్లు అమ్ముకుంటె మామూలాదార్లకు కోట్లరూపాయలు లాబంవస్తది. మరి అంత సారా కావాలంటె దొంగ సారా కాయాల్సిందే. లేకుంటే అంత సారా ఎట్లా తయారయితది?" అని పశ్నార్థకంగాచూసి మళ్ళిగొంతెత్తింది. అది మరింత కరుకుగా తయారైంది.

"అగో గట్ల వేలకు వేల లీటర్లు దొంగసారా తెచ్చిఅమ్మెటోల్లు బాగానేఉన్నరు వాళ్లు అట్లా చేయకుంటే వాళ్ళకు లాభాలు రావన్న సంగతి సారా తాగే జనానికి

తెలియకున్నా గవర్నమెంటుకు మాత్రం తెలుసు. మరి అటువంటప్పుడు గవర్నమెంటు వారి ఎక్సయిజ్ శాఖ ఎందుకున్నదని అనుమానం రావచ్చు."

"ఆపు ఆపు" అన్నాడు జడ్జి కాని మావాడు అది గమనించకుండానే "ఎక్సయిజ్ శాఖ వాళ్ళు చట్ట విరుద్ధంగా దొంగసారా తయారు కాకుండా చూసెటోళ్ళు. కాని వాళ్ళకు ఈ మాములాదార్లు దొంగసారా తయారు చేస్తరన్నది తెల్వ. మరటు వంటప్పుడు పీల్లు చేసె పనేమిటంటె! దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్న మాదిరి సారాతాగే కూలి జనం స్వంతానికి సారా కాసుకోకుంటా చూడటమే వాళ్ళపని. సారా తాగేజనం ఎవరికివారే సారాకాసుకొని తాగితే లక్షల రూపాయల పాట పాడిన మాములాదార్లు ఏం కావాలి? వాళ్ళద్వారా గవర్నమెంటుకు టాగ్రాజుల మీద వచ్చే కోట్లాది రూపాయలు ఏంకావాలి? అందుకోసం సారాతాగే జనమంత లైసెన్సు పొందిన సారా కంట్రాక్టర్లు తయారు చేసిన దొంగసారే తాగాలి కానీ ఎవరికి వాళ్ళు సారా కాసుకొని తాగద్దు. ఆలా జనం దొంగ సారా కాయకుండా చూసేందుకే ఎక్సయిజశాఖ ఉంచి. ఈ ఎక్సయిజ్ వాళ్ళ వాళ్ళపనిని మరింత పకడ్బందీగా నిర్వహించటానికి తుపాకులిస్తామని గా మధ్యన వచ్చిన ఎక్సయిజ శాఖ మంత్రి అన్నడు మంత్రి అంటె జ్ఞాపకానికొచ్చింది. అగో ఆయన గా మంత్రి పదవికి రాకముందు ఆయనో పెద్ద సారా మాములాదారే. ఆయన ఎలక్షన్లప్పుడు సారా కంట్రాక్టర్లంత దమ్ముకొద్ది సారా ఉచితంగా పంచి గెలిపించిండ్లు. సారాతోనే పుట్టి సారాతోనే ఎదిగిన సారా మంత్రి ఆ మాత్రం వాళ్ళకు మేలు చేయకుంటే ఎవరికి చేస్తడు?" వ్యవహారం బాగానే ఉందన్నట్టు తలెగరేశాడు జడ్జి.

"సారా కంట్రాక్టరు, సారా పోసి ఓట్లు కాని సారా మంత్రియై పోవుడేంది? కూలి చేసుకునెటోడెవడన్న సంమరానికింత సారా కాసుకుంటె దొంగయిపోవుడేంది? అగ్గో అటు వంటి కూలి జనాన్ని పట్టుకొచ్చి సారా కంట్రాక్టర్లు వాళ్ళ స్వంత లాకప్పులో వేసి రోజుల తరబడి చిత్రహింసలు మాన భంగాలు చేసి ధర్మ ప్రభువుల తమ ముందుకు తీస్కవస్తే తమరు వాళ్ళకు శిక్షలేసి జేళ్ళకు పంపుతరు. వేల లీటర్లు దొంగసారా కాసే మాములాదార్లు హాయిగుంటరు. అగో వాళ్ళకే గా ఎక్సయిజ్ ఇన్స్పెక్టర్లు పోలీసులు వంగి వంగి సలాములు చేస్తరు.

మీరు మాకుశిక్షలు వేస్తరు. పాపంగాపాడే మందులకేమొ అల్కహాలు లేదంటరు. పానాందీశే సారా చేశేటానికేమొ టాంకులకు టాంకులు సప్లయిజేస్తరు" అంటూ మా వోడు అపహాసంగా పలికిడు.

ఇన్నేల్లు సారాకొట్టులో పనిజేసినా గాని నాకు అంత వివరంగా అర్థంకాని సారా దోపిడివి, మా వోడు అంతవివరంగా తెలిపేసరికి నాకు ఆశ్చర్యం, ఆనందం కల్గింది. అభినందనగా ఆవేశం ఆగక అతని చేతినినొక్కాను.

అంతవరదాక ఎందుకో-మౌనంగా ఉన్న జడ్జిగారు ముఖం కోపంతో చిరు చిరు లాడింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేచి "ఏయ్ మిస్టర్ అనవసర విషయాలను ప్రస్తావించక అడిగిన దానికి సూటిగా జవాబు చెప్పాలి" అంటు రెచ్చిపోయిండు.

మా వోనికి కోపం తారాస్థాయికి చేరింది ఆవేశంతో శరీరమంత వూగి పోతాంటే మళ్ళీ మాట్లాడ సాగిండు....

"అవునుసార్ మేం మాట్లాడవద్దు. మా చేతులకు తాళాలు వేసినట్లు మానోటికి కూడా తాళాలు వేయిండ్రి. అప్పుడిక మేం నోరుమూసుకుంటాం ఎవడన్న ఆకలై పిడికెడు మెతుకులు ఎత్తుకపోతే దొంగయిపోతాండు కాని వేల బస్తాలు బ్లాక్‌లో దాపి, అమ్మేసే షావుకారు పెద్దమనిషై పోతాండు. ఎవడన్నా పండుగకో పబ్బానికో సారా కొనుకుంటె దొంగయిపోతాండు. పబ్లిగ్గా దొంగ సారా అమ్మే కంట్రాక్టరు పెద్ద సేటయిపోతాండు. వాడే మంత్రిఅయి రాజ్యాన్ని ఏలుతండు. అంతా దొరల రాజ్యమైపోయింది.

జడ్జి అసహనంగా బల్లమీద సుత్తిమోగించాడు. కేసు వాయిదా వేస్తున్నట్టుగా ప్రకటించి పోలీసులవైపు చూసిండు. "ఇక వీళ్ళను తీస్కవెళ్లు" అన్నట్లుగా.

అంతవరదాకా గాండ్రుకప్పలాంటి మొఖంతో మావైపే క్రూరంగా చూస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశరావు దబదబ ముందుకు వచ్చి లాటీ ఆడించుకుంటు ఎడమచేత్తో మమ్మల్ని ముందుకు తోసిండు.

జైలు కటకటాల వెనుక మరో వాయిదాకోసం మేం నిరీక్షిస్తున్నాం.

భోపాల్

ఉషా ఎస్. డాని

అంతా వన్ వే ట్రాఫిక్. అన్నిదారులూ శ్మశానానికే రోడ్లమీద, చెట్లకింద ఫుట్‌పాత్‌లపై, ప్లాట్‌ఫారాలపై, రైళ్ళలో, బస్సుల్లో, బంగ్లాల్లో, పూరిగుడిసెల్లో శ్వాసపీల్చలేని ఊపిరితిత్తులతో, అగ్నిగోళాల్లామండుతూ, బయటికి తన్నుకవచ్చేస్తున్న కళ్ళతో ప్రాణం గుప్పిట్లో పెట్టుకొని నడుస్తూ, పరిగెడుతూ, స్పృహతప్పుతూ, గుట్టలు గుట్టలుగా శవాలు. కుప్పలు తెప్పలుగా శవాలు.

మనుషుల్ని సమిధలుచేసి సామ్రాజ్యవాదం ఆ రాత్రి భోపాల్లో నరమేధం జరిపింది. ఈ యాగానికి యజ్ఞవాటికను అమర్చింది మాత్రం ఈ దేశపు దళారీ పాలకవర్గం. మొదటి ప్రపంచ యుద్ధంలో మొదటిసారిగా లెతేల్ మారణవాయువును సరఫరా చేసింది యూనియన్ కార్బైడ్. అదే యూనియన్ కార్బైడ్ ఇప్పుడు భారత మధ్యప్రదేశంలో డిసెంబర్ 2 అర్ధ రాత్రి "మిథైల్ ఐసో సైనేట్" బాంబును పేల్చింది.

8 లక్షల భోపాల్ జనాభాలో దాదాపు 3 వేల మంది చనిపోయారు. మరో ఇరవై వేల మంది చనిపోనున్నారు. రెండు లక్షల మంది విషవాయువు ప్రభావంలో విషణ్ణులయ్యారు. వాళ్ళు బతకొచ్చు కానివాళ్ళంతా కురుపులతో, వాళ్ళు మిగలొచ్చు కాని జీవితాంతం కళ్లులేని అంధకారంతో.

ఒళ్ళో ఒదిగి పడుకున్న పేగు ఒళ్ళోనే చల్లబడిపోతే "చిన్నా! చిన్నా!" అంటు బద్దలయిపోతున్న తల్లుల గుండెల మంటలు. చనిపోయిన తల్లి రొమ్ముల్ని పట్టుకొని బతుకుకోసం విలపిస్తున్న పిల్లల ఆక్రందనలు. ఎన్నో ఆశలు, మరెన్నో స్వప్నాలు, సామూహిక శవదహనాల్లో బుగ్గయిపోతుంటే నిస్సహాయంగా కొయ్యబారిపోయిన ఆత్మీయుల ఆవేదనలు.

నెహ్రూ బూడిదను ఆయన ఆఖరి కోరికగా దేశమంతా పొలాలమీద చల్లితే ఈ భూమి చూసింది. ఇందిరా చితాభస్మాన్ని ప్రత్యేక రైళ్ళలో తెస్తే ఈ దేశం చూసింది. ఇప్పుడు తమ జీవితాలు తమ ముందే బూడిదైపోవటం భోపాల్ ప్రజలు చూస్తున్నారు.

చనిపోయినవాళ్ళలో అత్యధికులు ముక్కుపచ్చలారని పసికందులు. బతికున్న పిల్లల పరిస్థితి మరీ ఘోరం. భావంకూడా తెలియని ఆ పసివాళ్ళకు తమ తల్లిదండ్రులు, తమ వారలు ఎందుకలా కాయ్యబారిపోయారో తెలియదు "స్వతంత్ర" భారతదేశంలో పిల్లాడు పుట్టగానే పట్టించే పాలదగ్గరనుంచి చచ్చాక చితిమీద పెట్టి కాల్చడానికి పోసే కిరసనాయిల్‌వరకు సామ్రాజ్యవాదుల అదుపాజ్ఞల్లోనే వుంటాయనీ, ఈ "స్వతంత్ర్యం" మనను వాళ్ళకు బందీలను చేసిందని ఆ పసికందు వూహకు తెల్వదు.

యూనియన్ కార్బైడ్ సామ్రాజ్యవాదం కాకపోవచ్చు. సామ్రాజ్యవాదానికున్న వేలవేల పడగల్లో వాడూ ఒక పడగ. వేలవేల కోరల్లో వాడూ ఒక కోర.

వాడు రైళ్ళల్లో, బస్సుల్లో దీపాలను వెలిగించినపుడు మనజీవితాల్లోని చమురునే పీలుస్తున్నాడని మనలో చాలామందికి తెలియదు. వాడు టార్చి లైట్లలో డ్రై బ్యాటరీ సెల్స్‌ను దూర్చుతున్నప్పుడు మనచుట్టు అడుగడుగునా టైంబాంబ్ సెల్స్‌ను "ఎవర్ రెడీ"గా బిగించేస్తున్నట్లు మనలో చాలామందికి తెలియదు.

కలకత్తా నుండి కన్యాకుమారి వరకు కచ్ నుండి కొచ్చిన్ వరకు భారతదేశపు తూర్పు పశ్చిమ కోస్తా తీరాల్లో మోటారు బోట్లు వచ్చి మత్స్యకారులు తమ వృత్తి నుండి మందలు మందలుగా గెంటివేయబడినపుడు, పోటీలో తమ నాటు పడవలు పరుగిడలేవనే అనుకున్నారుగానీ ఆ మోటారుబోట్ల వెనక సామ్రాజ్యవాదం యూనియన్ కార్బైడ్‌ల రూపంలో వచ్చిందని వాళ్ళకు తెలియదు.

వాడు సముద్రంలో నుండి దేశాన్ని చుట్టుముట్టి ఊరుకోలేదు. మన నేలమీద కాలుమోపాడు.

ఒక్కోసారి వాడి రసాయన ఎరువుల్నివాడేస్తే మన సాంప్రదాయ ఎరువులకు కాలం చెల్లిపోతుందనిగానీ, అలవాటుచేసి దాన్ని అవసరంగా మార్చి ఎరువుల్తో, మందుల్తో మన పంటలకు సారం అంటూ వాడు మన శ్రమసారాన్ని పిండేస్తాడనిగానీ నిజంగానే ఏ రైతుకూ తెలియదు.

వాడు భూమిని చాపగా చుట్టి తీసుకుపోలేదు. సముద్రంతో చుట్టుముట్టి భూమిని బంధించి చాపకింద నీరులా దేశమంతా పాకిపోయాడు. మన నేలలోతుల్లో,

భూస్వామ్యం పట్టుతో పెళ్లానుకుంటూ ఈ భూమి మీద విష వృక్షమయి వ్యాపిస్తున్నాడు.

వాన్ని అంతం చేసేదెవరు? మరి ఈ నేలతల్లిని విముక్తం చేసేదెవరు? దీన్ని ఎవరు సేద్యం చేస్తున్నారో వాళ్ళు. ఈ నేలను దున్ని ఎవరు తమ చెమటను కాల్వలుగా మార్చి పంటలు పండిస్తున్నారో వాళ్ళు. వాళ్ల మాత్రమే. సామ్రాజ్యవాద విషక్రిముల్ని, క్రిమిసంహారం పేరుతో వస్తున్న సంహారక క్రిముల్ని ధ్వంసం చేయగలరు. వాళ్ళుమాత్రమే ఏ బూడిదకైనా పేక్షకులుగా మిగలరు. వాళ్ళు మాత్రమే భూస్వామ్యాన్ని భూస్థాపితంచేసి సామ్రాజ్యవాదాన్ని బూడిద చేయగలరు. అలా చేయాలంటే దున్నేవాడికే భూమి దక్కాలి. అలా దక్కాలంటే వాళ్ళకు రాజ్యంపై అధికారం రావాలి. శ్రామికులకు రాజ్యాధికారం, అదీ అసలు విషయం.

సమస్య యంత్రాలను ఉపయోగించడం కాదు. సమస్య అధికారం ఎవరిదని?

* * *

సామ్రాజ్యవాద దేశాలు ప్రమాదకరమైన పరిశోధనలన్నింటినీ, మూడో ప్రపంచం ప్రాణాలతో చెలగాడుతూ చేస్తున్నది. ప్రపంచం మొత్తంలో ఒక్క వెస్ట్ వర్జీనియాలో మాత్రమే ఉన్న ఫాస్జీన్ విషవాయువు కర్మాగారం మన గడ్డమీద పెట్టుకోవడానికి సాదరంగా ఆహ్వానించినవాళ్ల భారత దళారీ పాలకవర్గాలు. పిల్లలమీద, ఎలుకలమీద ప్రయోగించినపుడే ఈ ప్రమాన్ని పసిగట్టి, అమెరికాలో ఈ అమెరికన్ కంపెనీకి అనుమతి ఇవ్వలేదు. అది పిల్లలమీద, వారి భవిష్యత్తుమీద ప్రమాద వాయువయి ప్రసరించినా మనం అసహాయులమయిపోతున్నాం.

పనికిమాలిన, తీసేసిన, అవుట్ డేటెడ్ టెలిఫోన్ పరికరాలను భారీ యంత్ర సామాగ్రిని సామ్రాజ్యవాదం మన నెత్తిన పడేసినపుడు మన పాలక వర్గాలు ఆ శిరోభారాన్ని శిరోధార్యంగా స్వీకరించాయి. క్యాన్సర్ కు కారణమవుతుందని పిల్లలదుస్తుల్లో ఫ్లేమ్ రిటార్డెంట్ ను ఉపయోగించడాన్ని అమెరికాలో నిషేధించినా లాభాలలో కమీషన్లే ప్రయోజనంగాగల మన భారత పాలక వర్గాలు అని దిగుమతి చేసుకొన్నాయి

ప్రమాదకర వస్తువుల్ని తయారుచేసే అమెరికన్ సంస్థలు, అమెరికన్ ప్రభుత్వం విధించిన జాగ్రత్త చర్యల్ని అమెరికాలో పాటించారేగానీ ఆ పదార్థాలు ఇతర

దేశాల్లో తయారు చేసేటప్పుడు ఆయా ప్రభుత్వాలు సూచించిన ఆయా జాగ్రత్తలు పాటిస్తే చాలు అని రీగన్ చట్టం చేసినప్పుడు సామ్రాజ్యవాదానికి ఒక నీతి, ప్రపంచానికి ఒక నీతి రీగన్ చెప్తున్నాడని అందులోని డబుల్ స్టాండర్డ్స్‌ని ఎత్తి చూపలేనంత విధేయంగా మన పాలక వర్గాలు మౌనం వహించాయి.

*　　　*　　　*

ఈ ఫ్యాక్టరీ నుండి ఈ గ్యాస్ లీక్ కావడం ఇది మొదటిసారి కాదు. 78లో అయింది. 80లో అయింది. మనుషులు చనిపోయారు. కానీ సామ్రాజ్యవాదంతో ముడిపడి వున్న మన దళారీపాలకుల ఆర్థిక విధానం ముందు ప్రాణాలకు విలువ లేదు.

ఈ ఫ్యాక్టరీలోనే కాదు. కొరాడే, సింగ్రౌలీ, గజ్రౌ పవర్ స్టేషన్లలోనూ, కొచ్చిన్, మధురా రిఫైనరీలలోనూ, అగ్నిప్రమాదాలు జరిగాయి. బొంబాయి హైలో ఆయిల్ టాంకర్ ఆరు రోజులు మండింది. గత ఏడాది ఢిల్లీలో ఎల్. పి. జి. గ్యాస్ కంపెనీలో ప్రమాదం జరిగింది. ఇకముందు ఇలాంటివి ఇంకా ఎన్నో జరుగుతాయి. సామ్రాజ్యవాదమే ఒక ప్రమాదం. ఆ ప్రమాదాన్ని మన నేలమీద కమీషన్ మర్చంట్స్‌గా, దళారీ వ్యాపారం చేస్తున్నవాళ్ళు మన పాలక వర్గాలు. అందుకే ఇలాంటి ప్రమాదకర వస్తువుల్ని తయారుచేసే సంస్థలకు అనుమతి ఇచ్చే సమయంలో ఇకముందు తగిన జాగ్రత్తలు తీసుకుంటామని 'రాజీవ్‌గాంధీ' ఎన్నికల వాగ్దానం చేశాడు గానీ అసలు అనుమతి రద్దు చేస్తానని మాత్రం అనలేదు.

*　　　*　　　*

భోపాల్ సంఘటన గ్యాస్ లీకేజ్ మాత్రమే కాదు. కేవలం సాంకేతికలోపాలకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. అది సామ్రాజ్యవాదానికి, మన దళారీ పాలక వర్గాలు చేస్తోన్న దాసోహ ఫలితం. యూనియన్ కార్బైడ్‌కోసం నగరం నడిబొడ్డున స్థలం ఇచ్చిన ప్రతిఫలంగా తమ వాళ్ళకు ఉద్యోగాలు బహుమానాలు పొంది ఆ గెస్ట్‌హౌస్‌లో సకల భోగాలు అనుభవించి ఇవాళ అండర్సన్‌ను అరెస్టు చేస్తేనో, యూనియన్ కార్బయిడ్ ఫ్యాక్టరీకి లైసెన్సు రెన్యూ చేయకపోతేనో మనకు సామ్రాజ్యవాదంతో తెగతెంపులు చేసుకొనే సాహసం వచ్చినట్లు కాదు. నిజానికి మన పాలక వర్గాల కలలో కూడా ఆ ఆలోచన లేదు. రాష్ట్ర దక్షిణ సరిహద్దుల్లో తీవ్రవాదుల కార్యకలాపాలు తీవ్రమైపోతున్నాయని వాటిని అణచడంకోసం మరింత తీవ్రమైన చర్యలు

తీసుకోవాలని ఆంధ్ర, ఒరిస్సా, మహారాష్ట్ర పోలీసులతో అత్యవసర రహస్యచర్చలు సాగిస్తున్న మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి, బస్తర్ అడవులనుంచి భూస్వామ్యాన్ని సామ్రాజ్యవాదాన్ని కాపాడే ప్రభుభక్తి వుంటుంది కానీ రాష్ట్ర రాజధానిలోనే, కేంద్ర కార్యాలయానికి కూతవేటు దూరంలో పొంచివున్న ప్రమాదం అది ప్రమాదమే అయినా అంతిమ సారాంశంలో అది మన ప్రభుత్వం యజమాని.

అట్లని ఇందుకు అర్జున్‌సింగ్‌ను మాత్రమే తప్పుపట్టలేం. "బహుళ జాతి కార్పొరేషన్ అందించిన ప్రలోభాలకు లోనయ్యారా?" అని మధ్యప్రదేశ్ ముఖ్య మంత్రిని నిలేసిన "ఈనాడు"కు ఈ దేశంలో పదిహేడు చోట్ల యూనియన్‌కార్బైడ్ ఫ్యాక్టరీలు ఉన్నాయని తెలియదా? అది ప్రతి రాష్ట్రంలోనూ తిష్టవేసి కూర్చుందని దాని విశాల సామ్రాజ్యవాద దాహానికి కాంగి, జనతా, తెలుగుదేశం తేడాలే తెలియవని రామోజీరావుకు తెలుపదా? ప్రపంచ మార్కెట్టులో ప్రవేశించేప్పుడయినా. అందుకే ఆయన బతికున్న మోటారు బోట్ల జోలికి పోకుండా చచ్చిన ఓడల్ని ముక్కల్నిచేసి అమ్ముకుంటున్నాడు కదా! సామ్రాజ్యవాదంతో రాజీపడి పత్రికలో పచ్చళ్లు అమ్ముకుంటున్నాడు కానీ పులిరాయుళ్ల ఎగుమతిలో పోటీపడితే పులిని మించిన గోళ్ళతో యూనియన్ కార్బయిడ్ తమను రక్కేసి చంపెయ్యగలదని ఫైనాన్సు మార్గదర్శకులకు స్పష్టంగానే తెల్సు. సామ్రాజ్యవాదంతో పోటీ, పబ్లిసిటీతో ఎన్.టి.ఆర్.ను ముఖ్యమంత్రిని చేయడంకాదు. ఆ పోటీలో లాభాపేక్ష గలవానికి సహజీవనం లేకపోతే పచ్చడి మెతుకులు కూడా మిగలవు. అందుకే యూనియన్ కార్బయిడ్ తెచ్చిన 'హరిత విప్లవానికి రంగు మార్చకుండా దిక్కుమార్చిన కమ్యూనిస్టులు కూడా జేజేలు పలికారు. మరి ఆ ఎరువులు తెచ్చిన ఆ 'హరిత విప్లవం' లేకుండా ఏష్యా, తూర్పు యూరప్‌దేశాల ట్రాక్టర్లకు మనదగ్గర మార్కెట్ లేదుకదా!

* * * *

ఈ విషాదానికి ప్రపంచమంతా బాధపడుతున్నది! డ్యూక్ ఆఫ్ ఎడిన్‌బరో నుండి యు.ఎస్.ఎస్.ఆర్. సుప్రీమ్ సోవియట్ దాకా ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించాయి. అమెరికా రాయబారి అప్పుడే ప్రధాని సంక్షేమ నిధికి మూడు లక్షల రూపాయలు ప్రకటించాడు. అట్లాంటాలోని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ నుంచి

ఒక వైద్య బృందాన్ని స్వయంగా రీగన్ పంపుతున్నాడు. కనుక బ్రిటన్, రష్యా, అమెరికా అనే సామ్రాజ్యవాదాలు మనకు చావునే కాదూ, సానుభూతినీ, సహాయాన్నీ అందిస్తున్నాయన్న మాట. భోపాల్‌లో పరిసరాల్లోచచ్చిన మిగిలిన శవాలకూ మనకూ పత్రికల నిండా సామ్రాజ్యవాద స్వాహాకారమే.

ఇంక మన ప్రభుత్వమా ! అస్సాంను రక్తపుటేరుల్లో ముంచి మరచిపొమ్మన్నది నాడు తెలంగాణలో 'ఆపరేషన్ పోలో'ను నేడు 'ఆపరేషన్ బ్లూ స్టార్'ను పీడకలగా మరచిపొమ్మంటున్నది వీళ్ళే. అయినా మన నాగరికత ఫ్రంట్ పేజీ భోపాల్ విషాదాన్ని స్పోర్ట్స్ పేజీ శివరామకృష్ణ బోలింగ్ విసుర్లకిందకి విసిరేస్తే ఆనందించే విలువలను సంతరించుకున్నది.

* * *

అయితే ఈ విశాల భోపాలం మన పార్లమెంటరీ పార్టీలను ఎంత విషాదానికి గురిచేసింది? ఎంతో విషాదానికి గురిచేసింది. మానవతా హృదయ స్పందన వల్ల కాదు- సామ్రాజ్యవాద వ్యతిరేకతవల్ల కాదు. తమ ఎన్నికల నాటకాలకు పరవశించే ప్రేక్షకుడు లేకుండా పోయాడని. ఏంచేసినా సమయానికో వ్యసనంలా వోటు వేసే ఓటర్లు ఎన్నికల ముందే తగ్గిపోయారని. అందుకే ఆ సామూహిక చితాభస్మాల మీద సానుభూతి వర్షాలు కురిపించి ప్రమాదం తొలగిపోయిందని చెప్పి మళ్ళీ భోపాల్‌ను యం.ఐ.సి. మత్తునుంచీ ఎన్నికలమత్తులోకి తీసుకపోయే ప్రయత్నాలు సాగుతున్నాయి.

* * * *

ఎమ్.ఐ.సి. నిర్గుణీకరించబడి ప్రమాదభయం పూర్తిగా తొలగిపోయిందని భోపాల్ ప్రభుత్వం సహాయశిబిరాలు కూడా ఎత్తివేస్తున్నదట. జనవరి 28 ఎన్నికల తేదీగా కూడా ప్రకటించింది. అంటే అస్థిపంజరమైన భోపాల్‌కు అర్జున్‌సింగ్ అభయహస్తం చాచాడు. గ్రీకు పురాణంలో హీరోద్ చక్రవర్తి తాను చచ్చిపోతాననే భయంతో లక్షలాది పసివాళ్ళను చంపి డిసెంబర్ 23 ను "ఇన్నోసెంట్స్ డే" (అమాయకుల దినం)గా ప్రకటించాడట. మన దళారీ పాలకవర్గాలు డిసెంబర్ 3 విషాద భోపాలాన్ని మరచిపొమ్మని వేళగాని వేళ ఎన్నికల భోపాలరాగం పాడుతున్నాయి.

వార్షిక సమీక్ష

సృజనకు దేశానికి మరో సంవత్సరం ముగిసింది 1984, అదేపేరుతో ఆంగ్ల నవలాకారుడు జార్జి ఆర్వెల్ మానవజాతికి ఊహించిన భయంకర భవిష్యత్‌కంటె సందిగ్ధంగానూ, సంక్లిష్టంగానూగడిచింది. దేశంలో రావణకాష్టంలాకాల్తున్న అస్సాం సమస్యకు పంజాబు తోడయింది. మొత్తం ఒక రాష్ట్రంమీద. మతంమీద సైన్యాలు యుద్ధం ప్రకటించాయి. పదహారేళ్ళపాటు దేశాన్ని పాలించిన పాలకవర్గ ప్రియ దర్శిని మతోన్మాద రాజకీయాలతో ఆత్మహత్య చేసుకొంది. భివాండీ నుండి ఢిల్లీ దాకా మతకల్లోలాలలో వేసకుపేలు ఊచకోత కోయబడ్డారు. బ్రహ్మపుత్రి లోయ నుండి నెల్లూరుజిల్లాదాకా వరదల్లో తుఫాన్‌లలో వందలాదిమంది మరణించారు. మతం, ప్రకృతి అనే రెండు "మానవేతర" శక్తుల పేరుతో పాలకులే దగ్గరుండి నిర్వర్తించిన మారణకాండలివి. వాటికనుగుణంగానే వ్యాపార సంస్కృతి కూడా మరింత విజృంభించింది. జీవితాలతో చెలగాటమాడే పోలీసులు నాటకాల్ని ప్రదర్శించటం మొదలెట్టారు. తెలుగులో మరి రెండు వ్యాపార వారపత్రికలు ఉన్నవాటికి తోడయ్యాయి. అసహజ లైంగిక ప్రవర్తనకు, సంఘ వ్యతిరేక హింసకు సీరియల్ నవల మరింత సామాజిక గౌరవాన్ని ఆపాదించింది. సామాజిక వైరుధ్యాల్ని వక్రీకరించి ప్రజా వ్యతిరేక శక్తులను హీరోలను చేస్తూ సినిమాలు పెరిగాయి. రాష్ట్రంలో కొత్తగా మరో డజను సినిమాహాళ్లు వచ్చాయి. వాటన్నిటికితోడు అత్యాధునిక ఎలక్ట్రానిక్ టెక్నాలజీ సంస్కృతిపై సంవత్సర కాలంలోనే తన ఆధిపత్యాన్ని స్థాపించుకొంది. టెలివిజన్ కేంద్రాలు పెరిగాయి. వీడియోపార్లర్లు విజృంభిస్తున్నాయి. రాజకీయరంగం లోనూ, సంస్కృతిలోనూ కూడా విశాల ప్రజానీకంలో తప్పుడు చైతన్యాన్ని పెంచేందుకు చేసిన ప్రయత్నాలివి. ఈ క్రమానికి ప్రతిగా ప్రజా పోరాటం విస్తృతిలోనూ వైవిధ్యంలోనూ విస్తరించింది. ప్రత్యేకించి మన రాష్ట్రంలో ఉత్తర తెలంగాణా జిల్లాల నుండి విప్లవ పోరాటం తూర్పు కోస్తా ప్రాంతానికి, రాయలసీమకు వ్యాపించింది. పొరుగు రాష్ట్రాలలో విప్లవోద్యమం వేళ్లూనింది. విప్లవ సాంస్కృతి కోద్యమం కథా రచనలోనూ, సామాజిక విశ్లేషణలోనూ ఒకడుగు ముందుకేసింది. పోరాట చైతన్యం మరింత పదునెక్కింది. సామాజిక విశ్లేషణద్వారా, సాహిత్యం ద్వారా తప్పుడు చైతన్యాన్ని బహిర్గతం చేస్తూ, పోరాట చైతన్యాన్ని ప్రతిఫలించే పత్రికగా సృజన తనచుట్టూ ఉండే వాస్తవికతతో అన్యోన్య సంబంధాన్ని మరింత బలపరచుకొంది.

ఈ సంవత్సరం ఆరంభంనుండే సృజన నిర్వహణ వర్కింగ్ ఎడిటర్ వ్యక్తిగత బాధ్యతగా తప్పి, సాహితీ మిత్రుల ఉమ్మడి బాధ్యతయింది. ప్రతి రచనను ఈ బృందం చదివి, చర్చించి ప్రచురిస్తుంది, లేదా నిరాకరిస్తుంది. ఈ పద్ధతిని ప్రజాస్వామికం చేసుకునే క్రమమూ, సృజనను మరింత ప్రామాణికంగానూ వస్తుగత దృష్టితోనూ తీసుకువచ్చే క్రమమూ ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయనేది అనుభవం మాకు నేర్పిన పాఠం. అయితే రచనలన్నీ ఎంపిక చేసి ప్రచురించడంలోనూ, అవసరమయిన సందర్భాలలో కారణాలతోసహా నిరాకరించడంలోనూ ఆలస్యాన్ని మేం నివారించలేకపోయాం. ఇది అనేకమంది యువ రచయితలకు ఇబ్బందిని కలుగజేసింది. బహుశా అపార్థాలకుకూడా దారితీసి ఉండవచ్చు. అలాగే ముద్రణ

సృజన 1984

మొత్తం సంచికలు 11 (ఒక సంయుక్త సంచికతో)
పేజీలు 868

ఖర్చు :	ముద్రణ	రూ.	12700–00
	పేపర్	రూ.	8340–00
	ఇతర ఖర్చులు	రూ.	2530–00
		మొత్తం	23570–00
ఆదాయం :	విరాళం	రూ.	517–00
	చందా	రూ.	11627–00
	అమ్మకాలు + ఏజెంట్లు	రూ.	3881–80
		మొత్తం	16025–80
		లోటు రూ.	7544–20

ఇబ్బందులవల్ల కనీసం నాలుగుసార్లు సంచిక చాలా ఆలస్యంగా వచ్చింది. వరంగల్ వాతావరణంలో కూడా సృజనను ముద్రించడానికి ముందుకొచ్చిన ముద్రణాలయాల్లో సాంకేతిక ఇబ్బందులు కలిగినపుడల్లా ముద్రణ విజయవాడకో, హైదరాబాద్‌కో మార్చవలసివచ్చింది. ఎంపికను, ముద్రణను, ప్రచురణను సమన్వయం చేయడంలో ఇది ఇబ్బందికి దారితీసింది. ఆర్థిక భారం కూడా పెరిగింది.

ఆర్థికంగా 1984 సృజనకు గడ్డు సంవత్సరం. ప్రతి సంచికకు సగటున 635 రూపాయల చొప్పున ఈ సంవత్సరం మొత్తం సృజనకూ 7545 రూపాయల లోటుని ఎదుర్కొంది. ముద్రణ ఖర్చు, పేపరు ఖర్చు 40 శాతం పెరిగాయి. ఆ కారణంగానే ఈ సంచికనుండి సృజన విడిప్రతి వెల 3 రూపాయలకి సంవత్సర చందా 30 రూపాయలకి పెరుగుతోంది. అయితే సృజన లోటుకి ఖర్చు పెరగడం ఒక్కటే కారణం కాదు. ఆదాయం సరిగా లేకపోవడం కూడా ఒక కారణం. దశాబ్ది కాలంగా సృజన సర్క్యులేషన్ రెండువేల దగ్గర స్థిరంగా ఉంది. ఇందులో 25శాతం చందాదారులు. మిగతావన్నీ ఏజెంట్లద్వారా అమ్ముడుపోతున్నవి. చాలామంది ఏజెంట్లు వందల వేల రూపాయలు బకాయిలు పడ్డారు. అమ్మిన సంచికలకి డబ్బులు పంప లేకపోవడానికి కొందరు ఏజెంట్లకి పరిస్థితులు కారణమయితే మరికొందరికి అలసత్వం బాధ్యతారాహిత్యం కారణం. ఎప్పటికప్పుడు ఏజెంట్లందరూ డబ్బులు చెల్లిస్తే సృజనకు లోటు ఉండే అవకాశం లేదు. వాళ్ళాపని చేసేలా చూసే బాధ్యతని ఆయా ప్రాంతాలలో అభిమానులయిన పాఠకులు చేపట్టాలని విజ్ఞప్తిచేయడం మినహా మేమీ విషయంలో నిస్సహాయులమే. స్థిర చందాలు 25 శాతం నుండి 50 శాతం పెరిగినా మా ఆర్థిక ఇబ్బందులు కొంత తగ్గుతాయి. ప్రస్తుతానికి మాత్రం నెల నెల పేరుకు పోతున్న ఈ వేలకు వేల లోటు సృజనకు ఋణభారాన్ని పెంచుతున్నది.

నిర్వహణ పరంగానూ, ఆర్థికంగానూ ఉన్న ఇబ్బందులకు తోడు నిర్బంధం కూడా పెరిగింది రాజ్యాంగం రాసిచ్చిన భావప్రకటనా స్వాతంత్ర్యంమీదా సృజనకు భ్రమలెపుడూ లేవు కాని కొత్త కొత్త రూపాల్లో జరిగే నిర్బంధం ఆకస్మిక ఇబ్బందులను సృష్టిస్తుంటుంది. వరంగల్‌లోనూ, ప్రత్యేకించి కుమార్‌పల్లిలోనూ సంవత్సర కాలంగా నెలకొని ఉన్న నిత్య నిర్బంధ వాతావరణం నిర్వహణలో ఆటంకాలు కలుగ జేసింది. చేతిలో సృజన ఉన్న నేరానికి ఒక హైకోర్టు న్యాయవాదిని రాత్రింతా లాకప్పులో బంధించారు హనుమకొండ పోలీసులు. హైదరాబాద్‌లో పత్రికాఫీసులో పనిచేసే ఒక యువ సబ్ ఎడిటర్‌ని కొత్తగా సృజన చందాదారుడయిన వెంటనే ఇంటరాగేట్‌చేసి బెదిరించారు. తెలంగాణా ప్రాంతంలో చాలా జిల్లాలలో ప్రమాదానికి సిద్ధపడి రహస్యంగా సృజన తెప్పించుకోవాల్సిన పరిస్థితి సృష్టింపబడింది. వరంగల్ పట్టణంలో కనీసం గోడలమీద 'సృజన చదవండి' అని రాసే స్వాతంత్ర్యం కాదు గదా అవకాశం కూడా పోయింది. ఈ సంవత్సర కాలంలో సృజన ఆఫీసుమీద సాయుధ పోలీసులు మూడుసార్లు దాడిచేసారు. మా కోరికమీద అనేక ప్రాంతాల

నుండి పంపిన కరపత్రాలని దొంగిలించుకుపోయారు. అయితే ఎన్నో ఇబ్బందులను నిర్బంధాలను ఎదుర్కొంటూ ఇన్ని సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ప్రచురింప బడుతున్న పత్రికగా సృజనకున్న బలం, దాని పునాది పోలీసుల కర్థం కాకపోయినా, పాఠకులకి తెలుసునని మా విశ్వాసం.

మొత్తంగా, 1984లో ఒక ఉమ్మడి సంచిక (జూన్ జూలై) తో కలిపి సృజన పదకొండు సంచికలు ప్రచురించింది. ఈ సంవత్సర కాలంలో 34 కవితలను, 18 పాటలను, 17 కథల్ని, 19 వ్యాసాల్ని, 16 రిపోర్టులని, 16 సమీక్షలని ఒక నాటికను ప్రచురించింది. ఒక ప్రత్యేక సంచికను వెలువరించింది. ఇందులో మమ్మల్ని బాగా బాధపెట్టిన లోటుని గురించి ముందుగా చెప్పుకోవాలి. ఈ పన్నెండు నెలల కాలంలోనూ తూర్పు కోస్తా తీరంలోనూ రాయలసీమలోనూ ప్రజా పోరాటం ముందుకు నడిచినా అక్కడి జీవితం, సంఘర్షణ సృజనలో తగినంతగా ప్రతిఫలించ లేదు. రాయలసీమ గురించయితే దాదాపుగా ఏమీ లేదనే చెప్పుకోవాలి, ఈ లోటు సృజనాత్మక సాహిత్యంలోనేకాక వ్యాసాలలోనూ, రిపోర్టులలోకూడా కన్పడింది. అందుకు రచనలు రాలేదనేది సంజాయిషీ కాగలదు గానీ సమర్థన కాలేదు. అందుకే రానున్నకాలంలో ఈలోటు భర్తీచేయడానికి మీ సహకారాన్ని కోరుతున్నాం. కాగా, సాహిత్యంలో, ముఖ్యంగా కథలలో భాష తమకర్థం కావడంలేదని కొన్ని ప్రాంతాల పాఠకులు ఇబ్బంది పడ్డారు. కొన్ని రచనలు, ముఖ్యంగా సామాజిక విశ్లేషణకు సంబంధించినవి, తమకర్థంకావడంలేదని మరి కొందరు పాఠకులు మా దృష్టికి తీసుకువచ్చారు. (అసలివి అనవసరమని కూడా కొందరు ధ్వనించారు) సృజన ఎంచుకున్న కాన్వాస్‌లో ఈ ఇబ్బందులు కొంత మేరకు అనివార్యం. అయితే ఇందులో రచయితల లోపమూ, సృజనలోపమూ కూడా చెప్పుకోతగ్గంతగా ఉన్నాయి. నిజానికి పాఠకులు మాదృష్టికి తీసుకరావడం వల్లనే మా లోపాల్ని మేం మరింతగా తెలుసుకోగలిగాం. ఎక్కువ మంది పాఠకులకి అర్థమయ్యేలా ప్రతి సంచిక రూపొందించడానికి మా ప్రయత్నమూ, రచయితల సహకారంతో పాటు పాఠకుల ఒత్తిడి కూడా అవసరం అనే ప్రాథమిక ప్రజాస్వామిక సూత్రాన్ని ఈ చర్య ద్వారా మేం గ్రహించగలిగాం, ఈ ప్రయత్నం, సహకారం, ఒత్తిడి మరింత బలంగా కొనసాగాలనే ఆకాంక్షతో 1985 కు సృజన స్వాగతం పలుకుతోంది.

— సాహితీమిత్రులు

(4వ కవర్ తరువాయి)

దేశం గుండెల కుంపటిలో
టైంబాంబు పేలుతుంది
విశ్వాసాల నిప్పురవ్వలారిపోయి
అంతా బూడిదవుతుంది

చీకట్లో వెతుక్కునే వేళ్ళకు
ఓట్ల కాగితాలు అందిస్తుంది 'చెయ్యి'

2

శత్రువు పీడకలలో
శవం ప్రశ్నిస్తుంది
జనావాసాలు శ్మశానాలయినపుడు

శ్మశాన శాంతిలో
మండుతున్న కళ్ళతో
ఊపిరి సలపని గుండెలతో
లక్షల ప్రాణాలు
ప్రతీకార లక్ష్యంతో జ్వలిస్తాయి
చచ్చే బ్రతికి విలువెల్లా దహిస్తూ
లక్షల ప్రాణాల నిప్పులు చెరుగుతాయి

సామ్రాజ్యవాదమే మృత్యువని
సామూహిక హత్యలు
దళారీ రహస్యాన్ని బయట పెడతాయి

విష వృక్షాన్ని కూల్చకుంటా
విషం నిర్మూలం కాదు

మరణ శయ్య పెంచి
విష శ్వాసలు వదులుతూ
యుద్ధాన్ని శాసిస్తున్న
సామ్రాజ్యవాదాన్ని
ప్రజలు అంతర్యుద్ధంలో
సమాధి చేస్తారు

SRJANA Telugu Monthly January '85 H/HNK-3
Regd. No. with Registrar of Newspapers 10953/67



ప్రాణవాయువు ప్రమాదమవుతుంది
చూపు చీకటవుతుంది
మాతృ స్తన్యం మృత్యువవుతుంది
భూస్వామ్య సస్యానికి
సామ్రాజ్యవాదం ఎరువయినప్పుడు

గ్రామాల రక్తం నేల పాలవుతుంది
జీవ సారాన్ని
'హరిత విప్లవం' హరిస్తుంది

నగరాలు
బహుళ జాతి కంపెనీల బాహువుల్లో
నలిగిపోతాయి
నగరం నడి బొడ్డుమీద
దళారీలు చిమ్నీగొట్టం ముట్టిస్తారు

(మిగతా 3వ కవర్‌లో)

SRJANA
Hanumakonda 506 001.
Single copy Rs. 3.00
Yearly Subscription Rs. 30/-